
Truth of News
RNI NO : APTEL/25/A0239
# సూర్య వాస్తవం
http://www.suryavastavam.in
చీఫ్ ఎడిటర్ : మొఘల్ ఇర్షాద్ బేగ్




IRS PUBLICATIONS
irspublications12@gmail.com

సంపుటి: 01 | చిత్తూరు | సంచిక : 34 | శనివారం 28 జూన్ 2025 | పేజీలు : 8 | వెల రూ.6.50

Circulated from Hyderabad, Vishakapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Anantapuram, kadapa, kurnool, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bengalore, Mumbai, New Delhi

### సుప్రీంకు తిరుమల
## కల్తీ లడ్డూపై సిట్ నివేదిక
### - సీల్డ్ కవర్‌లో అందించిన అధికారులు

**న్యూఢిల్లీ - సూర్య వాస్తవం, జూన్ 27:**
తిరుమల శ్రీవారి ప్రసాదం లడ్డూకి ఉపయోగించే నెయ్యి కల్తీ వ్యవహారంపై సుప్రీంకోర్టుకు సిట్ నివేదిక అందించింది. రెండు రోజుల క్రితం సీల్డ్ కవర్‌లో సుప్రీంకోర్టుకు ఈ నివేదికను సిట్ అధికారులు అందించినట్లు సమాచారం. ఇందులో ప్రధానంగా కేసు దర్యాప్తు పురోగతి, ఇప్పటి వరకు దర్యాప్తులో తేలిన విషయాలతో నివేదిక అందించారని సమాచారం. అలాగే, ఈ కేసు దర్యాప్తు ప్రారంభించినప్పటి నుండి ఇప్పటి వరకు బయటపడిన అంశాలు, స్థానిక కోర్టు నుండి హైకోర్టు వరకు కూడా నిందితులు దాఖలు చేసిన పిటిషన్లు, వాటిపైన జరుగుతున్న విచారణ, వాటి పురోగతి తదితర అంశాలను నివేదికలో పేర్కొన్నట్లు తెలుస్తోంది. తిరుపతి ప్రసాదం లడ్డూలో వాడే నెయ్యిలో జంతువుల కొవ్వు కలిసిందని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు చేసిన ఆరోపణలు సర్వత్రా చర్చకు, విమర్శలకు దారితీశాయి. దీంతో ఈ అంశం సుప్రీం కోర్టు పరిధిలోకి వెళ్లింది. విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు సిట్‌ను నియమించిన సంగతి తెలిసిందే. అసలు చాలా విషయాలను సుప్రీంకోర్టుకు ఇచ్చిన




రిపోర్టులో వెల్లడించి ఉంటారని భావిస్తున్నారు. ఇటీవల తనకు ఓ పోలీసు అధికారి నోటీసులు జారీ చేశారని ఆయన సిట్‌లో భాగం కాదని వైసిపి రాజ్యసభ సభ్యుడు వైవి సుబ్బారెడ్డి కోర్టు కెళ్లారు. దీంతో కోర్టు కూడా వైవి సుబ్బారెడ్డికి ఇచ్చిన నోటీసుల్ని రద్దు చేసింది. ఏది ఏమైనా సిట్ రిపోర్టులో ఏముందనేది సుప్రీం కోర్టు విచారణలో తేలనుంది.

### సింగయ్య మృతి కేసులో
## జగన్, ఇతరులకు ఊరట
### - కఠిన చర్యలు తీసుకోవద్దని పోలీసులకు హైకోర్టు ఆదేశం

**అమరావతి - సూర్య వాస్తవం, జూన్ 27:**
వాహనం కింద పడి సింగయ్య మృతి చెందాడంటూ గుంటూరు జిల్లా, నల్లపాడు పోలీసులు నమోదు చేసిన కేసులో మాజీ సిఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎంపి వైవి సుబ్బారెడ్డి, మాజీ మంత్రులు పేర్ని నాని, విడదల రజిని, జగన్ పిఎస్ కె నాగేశ్వర్ రెడ్డికి హైకోర్టులో ఊరట లభించింది. తదుపరి విచారణ జరిగే మంగళవారం వరకు వాళ్లపై ఏ విధమైన కఠిన చర్యలూ తీసుకోరాదని పోలీసులను హైకోర్టు ఆదేశించింది. వాహనాన్ని నడిపిన కారు డ్రైవర్ పైనే కాకుండా కారులో ఉన్న వాళ్లపై కేసు ఎలా నమోదు చేస్తారని నిలదీసింది. భారీగా జనం ఉన్నప్పుడు జాగ్రత్తలు తీసుకున్నప్పటికీ ఒక్కోసారి ప్రమాదాలు జరుగుతాయని అభిప్రాయపడింది. కుంభమేళాకు భారీ ఏర్పాట్లు జరిగినా ప్రమాదం జరిగిందని గుర్తు చేసింది. సింగయ్య మృతి వివరాలు అందజేయాలని పోలీసులకు నోటీసులు జారీ చేసింది. ఈ మేరకు శుక్రవారం జస్టిస్ కొనకంటి శ్రీనివాసరెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. నల్లపాడు పోలీసులు నమోదు చేసిన కేసును కొట్టేయాలంటూ జగన్, ఇతరులు వేసిన వ్యాజ్యాల తరపున సీనియర్ న్యాయవాదులు ఎస్ శ్రీరామ్, పొన్నవోలు సుధాకర్ రెడ్డి, చిత్తరవు రఘు ఇతరులు వాదించారు. వేరే వాహనం కింద పడి సింగయ్య మరణించారని ఎస్పి ప్రకటించారని, తర్వాత జగన్ ప్రయాణించే వాహనమని చెప్పి కేసు నమోదు చేశారని చెప్పారు. మాజీ ముఖ్యమంత్రికి భద్రత కల్పించకుండా ప్రభుత్వం, పోలీసులు కావాలని వ్యవహారాన్ని గాలికి వదిలేశారని చెప్పారు. పోలీసుల తరపున ఎజి దమ్మాలపాటి శ్రీనివాస్ వాదిస్తూ, కేసు నమోదు వెనుక రాజకీయ ఉద్దేశాలు ఏమీ లేవన్నారు. సింగయ్య కారు కింద పడ్డాడని తెలిసి కూడా వాహనాన్ని ముందుకు పోనిచ్చారని చెప్పారు. సమగ్ర వివరాలతో కౌంటర్ వేస్తామని, వాయిదా వేయాలని కోరారు. వాదనల తర్వాత హైకోర్టు, తదుపరి విచారణను మంగళవారానికి వాయిదా వేసింది.





### ఏపీలో ఏరోస్పేస్-డిఫెన్స్ పాలసీ 4.0

- 2025 నుంచి 2030 వరకు ఈ కొత్త విధానం అమలు
- రాష్ట్రానికి లక్ష కోట్ల రూపాయల పెట్టుబడులు ఆకర్షించడమే ప్రధాన లక్ష్యం
- వచ్చే ఐదేళ్లలో లక్ష మందికి ఉపాధి అవకాశాలు కల్పించాలని టార్గెట్
- ఏరోస్పేస్, డిఫెన్స్ హబ్‌ల కోసం రాష్ట్రవ్యాప్తంగా 23 వేల ఎకరాల గుర్తింపు
- పెట్టుబడులకు వేగంగా అనుమతుల కోసం సింగిల్ డెస్క్ విధానం

**అమరావతి - సూర్య వాస్తవం, జూన్ 27**
ఏరోస్పేస్, రక్షణ రంగాల్లో ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే అగ్రగామిగా నిలపాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు 'ఏపీ ఏరోస్పేస్-డిఫెన్స్ పాలసీ-4.0'ను ప్రకటించింది. 2025 నుంచి 2030 మధ్య కాలానికి

- మిగతా 2లో..

### సాంకేతికతతో
## నేర రహిత రాష్ట్రంగా ఏపీ

- వివేకా హంతకులను పట్టించింది టెక్నాలజీనే
- ఏఐ హ్యాకథాన్‌లో సీఎం చంద్రబాబు
- గుంటూరులో ఏఐ ఫర్ ఏపీ పోలీస్-హ్యాకథాన్-2025
- హాజరైన సీఎం చంద్రబాబు
- టెక్నాలజీ వినియోగంపై ఆసక్తికర ప్రసంగం




**గుంటూరు - సూర్య వాస్తవం, జూన్ 27**
సాంకేతికతతో ఆంధ్ర ప్రదేశ్‌ని నేర రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి చంద్రబాబు పోలీసులకు పిలుపినిచ్చారు. టెక్నాలజీతో దర్యాప్తు ఎలా చేయాలో వివేకా హత్య కేసే ఉదాహరణ అని చంద్రబాబు చెప్పారు. గుంటూరు ఆర్వీఆర్ అండ్ జేసీ కాలేజీలో నిర్వహించిన ఏఐ ఫర్ ఏపీ పోలీస్-హ్యాకథాన్-2025 కార్య క్రమంలో సీఎం చంద్రబాబు పాల్గొన్నారు. నేరాల కట్టడికి, వేగవంతమైన దర్యాప్తునకు పోలీస్ విభాగం టెక్నాలజీని వినియోగించుకునే అంశంపై ఈ హ్యాకథాన్ ఏర్పాటు చేసింది. ఏపీ పోలీస్ విభాగం, అమెరికాకు చెందిన 4 సైట్ ఏఐ సంస్థలు ఈ హ్యాకథాన్ నిర్వహించాయి. ఈ హ్యాకథాన్ లో 160కు పైగా టీములు పాల్గొన్నాయి. ఈ టీములతో సీఎం చంద్రబాబు కొద్ది సేపు ముచ్చటించారు. పోలీస్ విభాగంలో టెక్నాలజీని వినియోగించడం ద్వారా ఎలాంటి సేవలు అందించవచ్చు... పనితీరును ఏ విధంగా మెరుగుపరుచుకోవచ్చనే అంశంపై వారితో ముఖ్యమంత్రి చర్చించారు.

**వివేకా హత్య కేసు... గూగుల్ టేకవుట్**
హ్యాకథాన్ కార్యక్రమానికి హాజరైన సీఎం చంద్రబాబు ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సదస్సులో ప్రసంగించారు. "రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధికి కట్టుబడి ఉంది. శాంతి భద్రతలు కంట్రోల్లో ఉంటేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుంది. అందుకే ఉమ్మడి రాష్ట్రానికి సీఎంగా ఉన్నప్పుడు కూడా శాంతి భద్రతలకు ఎక్కువ ప్రాధాన్యతనిచ్చానని స్పష్టం చేశారు. దీనికి పోలీస్ శాఖ సమర్థవంతంగా పని చేయాలి. గతంలో

- మిగతా 2లో..



### మోడీ పాలనలో
## వ్యవస్థలు నిర్వీర్యం
### - దేశంలో అప్రకటిత ఎమర్జెన్సీ
### - పీసీసీ అధ్యక్షులు వైఎస్ షర్మిల

**ఏలూరు - సూర్య వాస్తవం, జూన్ 27:**
దేశంలో గత పదకొండు సంవత్సరాలుగా అప్రకటిత ఎమర్జెన్సీ నడుస్తోందని పిసిసి అధ్యక్షులు వైఎస్ షర్మిల తెలిపారు. ఏలూరులోని నేరెళ్ల రాజా కల్యాణ మండపంలో కాంగ్రెస్ పార్టీ విస్తృత స్థాయి సమావేశం శుక్రవారం జరిగింది. ఈ సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఎమర్జెన్సీ మీద మోడీ నిస్సిగ్గుగా మాట్లాడుతున్నారని, ఆ ఎమర్జెన్సీ కంటే ప్రస్తుత అప్రకటిత ఎమర్జెన్సీతో దేశంలో

- మిగతా 2లో..

### పర్యాటక ప్రాజెక్టులకు
## పారిశ్రామిక హోదా

- ఏపీని ప్రపంచ స్థాయి పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామన్న సీఎం చంద్రబాబు
- వెల్‌నెస్, హ్యాపీనెస్ డెస్టినేషన్‌గా ఏపీని అభివృద్ధి చేస్తామని స్పష్టీకరణ
- రాష్ట్ర పర్యాటక సలహాదారుగా యోగా గురు బాబా రామ్‌దేవ్‌కు బాధ్యతలు
- ఎట్టుబడిదారులకు గంటల్లోనే అనుమతులు, పరిశ్రమలకు ప్రోత్సాహకాల వెల్లువ
- నాలుగేళ్లలో హోటల్ గదుల సంఖ్యను 15 వేలకు పెంచడమే లక్ష్యం




**గుంటూరు - సూర్య వాస్తవం, జూన్ 27**
ఆంధ్రప్రదేశ్‌ను ప్రపంచ పర్యాటక చిత్రపటంలో అగ్రస్థానంలో నిలబెడతామని, గ్లోబల్ టూరిజం డెస్టినేషన్‌గా తీర్చిదిద్దుతామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ధీమా వ్యక్తం చేశారు. పర్యాటక రంగం రాష్ట్ర భవిష్యత్తుకు గేమ్ ఛేంజర్ వ[illegible] రంగానికి పారిశ్రామిక హోదా కల్పించామని ఆయన

- మిగతా 2లో..

సూర్య వాస్తవం దినపత్రికలోని మరిన్ని వార్తల కోసం సంప్రదించండి



### ప్రవాసాంధ్రుల అభ్యున్నతే ప్రధాన లక్ష్యం

- ఏపీఎన్ఆర్‌టీ అధ్యక్షుడిగా వేమూరు రవికుమార్ బాధ్యతలు స్వీకరణ
- రాష్ట్ర అభివృద్ధిలో ఎన్నారైలను భాగస్వాములను చేస్తామని వెల్లడి
- విదేశాల్లోని తెలుగు విద్యార్థులకు ఉద్యోగాల కల్పనపై ప్రత్యేక దృష్టి
- అమరావతిలో ఎన్నారై ఐకానిక్ టవర్ రెండేళ్లలో పూర్తి చేస్తామని హామీ

2లో

# మోడీ పాలనలో వ్యవస్థలు నిర్వీర్యం

(మొదటిపేజీ తరువాయి)

మొత్తం వ్యవస్థలన్ని నాశనమయ్యాయని తెలిపారు. గోద్రా, మణిపూర్ ఘటనలకు ఎవరు కారణమని ప్రశ్నించారు. మతం పేరుతో బిజెపి ప్రజల మధ్య చిచ్చు పెడుతోందని, మంటలు పెట్టి చలి కాచు కుం టోందని, ఇది ఎమర్జెన్సీ కాదా? అని నిలదీశారు. దేశ సంపదను అదాని, అంబానికి దోచిపెడుతున్నారని విమ ర్శించారు. ఇడి, సిబిఐ, ఐటి, ఎన్నికల సంఘం అన్నీ బిజెపి గుప్పెట్లోనే ఉన్నాయని, ఎవరినీ స్వేచ్ఛగా మాట్లాడనివ్వడం లేదని విమర్శించారు. ఒకవేళ మాట్లాడితే అక్రమ కేసులు పెట్టి ప్రతిపక్షాల గొంతు నొక్కుతున్నారని అన్నారు. వైసిపి, బిఆర్ఎస్ లాంటి పార్టీలు కేసులకు భయపడి మోడీ గుప్పెట్లోకి వెళ్లాయని, మీడియాను కూడా గుప్పెట్లో పెట్టుకున్నారని, ఇది కాదా ఎమర్జెన్సీ అని ప్రశ్నించారు. పదకొండేళ్లుగా కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అధికారంలో ఉండి విభజన హామీలను నెరవేర్చలేదని, రాష్ట్రానికి ప్రత్యేక హెూదా ఇవ్వకుండా మోసం చేసిందని, పోలవరం ప్రాజెక్టు ఎత్తు తగ్గించి అన్యాయం చేస్తుందని తెలిపారు. మోడీకి యోగా మీద ఉన్న శ్రద్ధ రాష్ట్ర ప్రజల మీద లేదని మండిపడ్డారు. టిడిపి, వైసిపి, జనసేన పార్టీలు మోడీకి తొత్తులుగా మారి పని చేస్తున్నాయని విమర్శించారు. విభజన హామీలు నెరవేరాలంటే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాలని తెలిపారు.

# ఏపీలో ఏరోస్పేస్-డిఫెన్స్ పాలసీ 4.0

(మొదటిపేజీ తరువాయి)

వర్తించే ఈ సరికొత్త విధానం ద్వారా రాష్ట్ర పారిశ్రామిక రంగానికి కొత్త ఊపునివ్వాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ మేరకు పరిశ్రమలు, వాణిజ్య శాఖ కార్యదర్శి ఎన్. యువరాజ్ ఉత్తర్వులు జారీ చేశారు.

**లక్ష కోట్ల పెట్టుబడులు, లక్ష ఉద్యోగాలే లక్ష్యం**

ఈ కొత్త విధానం ద్వారా వచ్చే ఐదేళ్లలో రాష్ట్రానికి ఏకంగా రూ. లక్ష కోట్ల కొత్త పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా ప్రభుత్వం నిర్దేశించుకుంది. దీని ద్వారా సుమారు లక్ష మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్లు స్పష్టం చేసింది. ఏరోస్పేస్, రక్షణ రంగాల్లోకి చిన్న, మధ్య తరహా పరిశ్రమలు (%మీావీజు%), స్టార్టప్‌లతో పాటు భారీ సంస్థలను కూడా ప్రోత్సహించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.

**హబ్ అండ్ స్పోక్ మోడల్‌లో పార్కులు**


పెట్టుబడులను ఆకర్షించేందుకు రాష్ట్రవ్యాప్తంగా పలుచోట్ల ఏరోస్పేస్, రక్షణ రంగ క్లస్టర్‌లను ఏర్పాటు చేయనుంది. ఇందుకోసం ఇప్పటికే 23 వేల ఎకరాల భూమిని గుర్తించినట్లు ప్రభుత్వం వెల్లడించింది. “హబ్ అండ్ స్పోక్” నమూనాలో ప్రత్యేకంగా ఎంఎస్ఎంఈ పార్కులను అభివృద్ధి చేయనున్నారు. ఏపీఐఐసీ నోడల్ ఏజెన్సీగా వ్యవహరించి ఈ పార్కులను అభివృద్ధి చేస్తుంది. ఈ పార్కుల్లో పెట్టుబడులు పెట్టే సంస్థలకు అవసరమైన అప్రోచ్ రోడ్లు, నిరంతర విద్యుత్, నీటి సరఫరా వంటి మౌలిక వసతులను ప్రభుత్వమే కల్పించనుంది. ఈ పార్కుల ఏర్పాటుకు ప్రభుత్వ, ప్రైవేటు భూములను వినియోగించుకోవడానికి అనుమతినిచ్చింది.

**పెట్టుబడిదారులకు ప్రత్యేక ప్రోత్సాహకాలు**

రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొచ్చే సంస్థలకు ఎలాంటి జాప్యం లేకుండా వేగంగా అనుమతులు ఇచ్చేందుకు “సింగిల్ డెస్క్ అప్రూవల్” విధానాన్ని అమలు చేయనున్నట్లు ప్రభుత్వం తెలిపింది. అంతేకాకుండా, పెట్టుబడిదారులను ఆకర్షించేందుకు ప్రత్యేక ప్రోత్సాహకాలు, రాయితీలు కూడా ఇవ్వనున్నట్లు పాలసీలో స్పష్టంగా పేర్కొంది. ఈ ఉత్తర్వులు జారీ చేసిన తేదీ నుంచి ఐదేళ్ల పాటు లేదా కొత్త విధానం ప్రకటించే వరకు ఈ పాలసీ అమల్లో ఉంటుందని, ఇప్పటికే మంజూరు చేసిన ప్రయోజనాలను తగ్గించేది లేదని ప్రభుత్వం హామీ ఇచ్చింది.

# ప్రవాసాంధ్రుల అభ్యున్నతే ప్రధాన లక్ష్యం

**అమరావతి - సూర్య వాస్తవం, జూన్ 27**



ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సలహాదారు, ఏపీ నాన్-రెసిడెంట్ తెలుగు (ఏపీఎన్ఆర్టీ) సొసైటీ నూతన అధ్యక్షుడిగా డాక్టర్ వేమూరు రవికుమార్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. తాడేపల్లిలోని సంస్థ కార్యాలయంలో వేదమంత్రోచ్చారణల మధ్య ఆయన పదవీ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తెలుగు వాళ్లు ఎక్కడున్నా నెంబర్ వన్‌గా ఉండాలన్న ముఖ్యమంత్రి చంద్రబాబు, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ ల లక్ష్యాలకు అనుగుణంగా ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రవాసాంధ్రుల సంక్షేమానికి, రాష్ట్రాభివృద్ధికి కృషి చేస్తానని స్పష్టం చేశారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగు ఎన్నారైలను రాష్ట్ర అభివృద్ధిలో భాగస్వాములను చేయడమే తమ ప్రధాన లక్ష్యమని రవికుమార్ తెలిపారు. కేవలం ఉద్యోగులుగానే ఉన్న ప్రవాసులను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేందుకు ప్రత్యేక ప్రణాళికతో ముందుకెళతామన్నారు. విదేశాల్లో చదువుకుంటున్న తెలుగు విద్యార్థులకు మెరుగైన ఉద్యోగావకాశాలు కల్పించేందుకు స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సహకారంతో శిక్షణా కార్యక్రమాలు చేపడతామని వివరించారు. వివిధ దేశాల్లోని ప్రభుత్వ కో-ఆర్డినేటర్లతో సమన్వయం చేసుకుంటూ ఈ కార్యక్రమాలను విజయవంతం చేస్తామని ఆయన పేర్కొన్నారు. అమరావతిలో రూ.950 కోట్ల వ్యయంతో నిర్మించ తలపెట్టిన ఎన్నారై ఐకానిక్ టవర్ నిర్మాణాన్ని రాబోయే రెండేళ్లలో పూర్తి చేస్తామని వేమూరు రవికుమార్ హామీ ఇచ్చారు. ప్రవాసాంధ్రులకు భరోసా కల్పించేందుకు ప్రత్యేక ఇన్సూరెన్స్ పథకాలను అందుబాటులోకి తెస్తామని, దీనికి ఏపీఎన్ఆర్టీ ఒక వారధిగా పనిచేస్తుందని అన్నారు. విదేశాల్లో తెలుగు సంస్కృతి, సంప్రదాయాలను ప్రోత్సహించేందుకు శ్రీవారి కల్యాణం వంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహిస్తామని తెలిపారు. రాష్ట్రంలో ఎన్నారైల పెట్టుబడులను ఆకర్షించడంలో ఏపీఎన్ఆర్టీ కీలక వేదికగా నిలుస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు.

ఈ కార్యక్రమానికి హాజరైన టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ, ఎన్నారై వ్యవహారాలపై మంచి పట్టున్న రవికుమార్ నియామకం శుభపరిణామమని, ఆయనకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ ఎమ్మెల్యేలు ఆనందబాబు, ఇంటూరి నాగేశ్వరరావు, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్ర ప్రసాద్, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య, బ్రాహ్మణ సాధికార సమితి అధ్యక్షులు బుచ్చిరామ్ ప్రసాద్, మాజీ ఎమ్మెల్సీ పరుచూరి అశోక్ బాబు, ఏపీఎస్ఎస్డీసీ ఛైర్మన్ బూరుగుపల్లి శేషారావు, ఏపీ లిడ్ క్యాప్ ఛైర్మన్ పిల్లి మాణిక్యరావు, ఏపీ ఎడ్యుకేషన్ ఇన్ ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ రాజశేఖర్, ఏపీఎస్ఎస్డీసీ ఎండీ గణేశ్ కుమార్, ఏపీఎన్ఆర్టీ సొసైటీ సీఈవో హేమలత రాణి, ఏపీ ఎన్ఆర్టీఎస్ డైరెక్టర్లు శేషుబాబు కానూరి, శాంతి, ఎన్నారై టీడీపీ గల్ఫ్ విభాగం అధ్యక్షుడు రాధాకృష్ణ రవి, ఎన్నారై టీడీపీ కువైట్ విభాగం అధ్యక్షుడు నాగేంద్ర బాబు అక్కిలి, ఎన్నారై మురళీ రాపాకతో పాటు పలువురు ఎన్నారైలు, నాయకులు పాల్గొన్నారు.

# సాంకేతికతతో నేర రహిత రాష్ట్రంగా ఏపీ





(మొదటిపేజీ తరువాయి)

మాదిరి కాకుండా పోలీసుల పనితీరు మారాలి. సహజంగా పోలీసులు పాత పద్ధతులను అవలంభిస్తారు. కానీ ఏపీ పోలీసులు టెక్నాలజీ అవసరాన్ని గుర్తించి ఈ రకమైన హ్యాకథాన్ ఏర్పాటు చేయడం సంతోషం. పోలీసులు తమ దర్యాప్తులో టెక్నాలజీని విరివిగా వినియోగించాలి. వివేకా హత్య కేసులో నాపై ఆరోపణలు చేశారు. నారాసుర రక్త చరిత్ర అంటూ విమర్శించారు. కానీ సీబీఐ తన దర్యాప్తులో గూగుల్ టేకవుట్ వంటి సాంకేతిక విధానాలను వినియోగించడం ద్వారా వాస్తవాలు వెలుగులోకి వచ్చాయి. ఇప్పటికీ వాళ్లు మారలేదు. మాజీ సీఎం అయ్యిండి తెనాలిలో రౌడీ షీటర్లకు సంఘీభావం తెలిపారు. ఇటీవల పల్నాడు జిల్లాలో పర్యటనలో ఏం జరిగిందో అందరూ చూశారు. తప్పులు చేసి బుకాయిస్తున్నారు. ఇలాంటి బుకాయింపులను తిప్పికొట్టాలంటే టెక్నాలజీని ఉపయోగించక తప్పదు” అని సీఎం స్పష్టం చేశారు.

**తాటతీస్తాం!**

ప్రభుత్వంలో టెక్నాలజీని వినియోగిస్తున్నామని.. పోలీస్ విభాగం కూడా సాంకేతిక అందిపుచ్చుకుంటోందని.. దానికి ఈ హ్యాకథాన్ నిర్వహణే నిదర్శనమన్నారు. “వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా ప్రభుత్వ సేవలు అందిస్తున్నాం. టెక్నాలజీ ద్వారా సేవలు అందించడమే కాదు... పాలనలో జవాబుదారీతనం పెరుగుతుంది. డ్రోన్లను... సీసీ టీవీ కెమెరాలు అన్ని చోట్లా పెడుతున్నాం. రౌడీలు గొడవ చేస్తే... ఆధారాలతో వారి చొక్కా పట్టుకునే పరిస్థితి తెస్తాం. ఇష్టానుసారంగా గంజాయి అమ్ముతాం, సేవిస్తాం, పండిస్తాం అంటే కుదరదు... తాటతీస్తాం. ఆడబిడ్డలను గొడవ చేస్తాం... అత్యాచారాలను చేస్తాం అంటే కుదరదు. ఏఐ లేనప్పుడే కంట్రోల్ చేశాం... ఇప్పుడు టెక్నాలజీ అందుబాటులోకి వచ్చింది... ఆధారాలు చాలా సులువుగా లభిస్తాయి. తప్పు చేస్తే... ప్రభుత్వం ఏం చేయాలో అది చేసి చూపిస్తాం. యువత టెక్నాలజీతో లబ్ధి పొందాలి. గతంలో ఐటీని ప్రమోట్ చేశాం. ఇప్పుడు క్వాంటం వ్యాలీ ద్వారా తెలుగు సత్తాను చాటబోతున్నాం. అమెరికాలో సిలికాన్ వ్యాలీ... ఇక్కడ క్వాంటం వ్యాలీ. వర్క్ లోకల్లీ... థింక్ గ్లోబల్లీ... యాక్ట్ గ్లోబల్లీ అనే విధంగా ప్రస్తుతం ప్రపంచం రూపాంతరం చెందుతోంది” అని ముఖ్యమంత్రి వివరించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, హెూం మంత్రి అనిత, డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా పాల్గొన్నారు.

# పర్యాటక ప్రాజెక్టులకు పారిశ్రామిక హోదా



(మొదటిపేజీ తరువాయి)

స్పష్టం చేశారు. విజయవాడలోని మురళీ ఫార్చ్యూన్ హెూటల్‌లో శుక్రవారం జరిగిన గ్లోబల్ ఫర్ సస్టెయినబుల్ ట్రాన్స్‌ఫర్మేషన్ (జీఎఫ్ఎస్టీ) టూరిజం కాన్‌క్లేవ్‌లో ముఖ్యమంత్రి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. వెల్‌నెస్, హ్యాపీనెస్ ఫ్యూచర్ డెస్టినేషన్‌గా ఏపీని తీర్చిదిద్దుతామని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు

**ఐటీని మించి ఉద్యోగాలు**

భవిష్యత్తు మొత్తం పర్యాటక రంగానిదే అని, అన్ని ‘ఇజం’ల కన్నా టూరిజమే గొప్పదని తాను దశాబ్దాల క్రితమే చెప్పిన మాట ఇప్పుడు నిజమవుతోందని చంద్రబాబు అన్నారు. “వ్యవసాయం, ఐటీ, తయారీ రంగాల కన్నా ఎక్కువగా ఉద్యోగాలు కల్పించే సత్తా ఒక్క పర్యాటక రంగానికే ఉంది. ఈ రంగం 20 శాతం వృద్ధి సాధించగలదు. పెట్టుబడులను ఆకర్షించేలా, ప్రజలకు ఆరోగ్యం, సంపద, ఆనందాన్ని పంచేలా ‘హెల్తీ, వెల్తీ, హ్యాపీ’ నినాదంతో ముందుకు వెళుతున్నాం,” అని ముఖ్యమంత్రి వివరించారు. రాష్ట్రంలో కలియుగ దైవం వేంకటేశ్వర స్వామి ఆలయం, శ్రీశైలం సహా అనేక పుణ్యక్షేత్రాలు, వెయ్యి కిలోమీటర్ల సుదీర్ఘ తీరప్రాంతం, కోనసీమ అందాలు, హార్సిలీ హిల్స్ వంటివి ఏపీకి గొప్ప ఆకర్షణలని ఆయన పేర్కొన్నారు. అఖండ గోదావరి ప్రాజెక్టును కూడా చేపడుతున్నట్లు తెలిపారు.

**పెట్టుబడులకు రెడ్ కార్పెట్**

రాష్ట్రంలో పర్యాటక ప్రాజెక్టులకు అత్యంత వేగంగా అనుమతులు మంజూరు చేస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారు. “అనుమతుల కోసం ఒక్క గంట కూడా వృథా కానివ్వం. రియల్ టైంలో అనుమతులు ఇచ్చేందుకు ‘స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్’ విధానాన్ని అమలు చేస్తున్నాం. మా ప్రభుత్వంలో అవినీతికి తావులేదు, కేవలం పారదర్శకత, జవాబుదారీతనం మాత్రమే ఉంటాయి,” అని ఆయన స్పష్టం చేశారు. పర్యాటక ప్రాజెక్టులకు విద్యుత్ సబ్సిడీలతో పాటు అనేక ప్రోత్సాహకాలు అందిస్తామని తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రంలో 3 వేల హెూటల్ గదులు ఉండగా, రాబోయే నాలుగేళ్లలో ఈ సంఖ్యను 15 వేలకు పెంచడమే లక్ష్యమని ఆయన వెల్లడించారు. ఎంఎస్ఎంఈ ప్రాజెక్టులకు మరిన్ని ప్రోత్సాహకాలు ఇస్తామన్నారు.

**టూరిజం సలహాదారుగా బాబా రామ్‌దేవ్**

ఈ సందర్భంగా, రాష్ట్రంలో వెల్‌నెస్ టూరిజాన్ని ప్రోత్సహించేందుకు పర్యాటక సలహాదారుగా వ్యవహరించాలని బాబా రామ్‌దేవ్ ను చంద్రబాబు కోరారు. “యోగా ద్వారా ప్రజల్ని మీరు ఎలా ప్రభావితం చేశారో, అదే విధంగా ఏపీ పర్యాటక రంగానికి బ్రాండింగ్ చేసి పెట్టుబడులు తీసుకురావాలి” అని చంద్రబాబు పేర్కొన్నారు. మదనపల్లిలో ఏర్పాటు చేయబోయే వెల్‌నెస్ సెంటర్‌ను ప్రపంచ స్థాయి ప్రమాణాలతో తీర్చిదిద్దాలని కోరారు.

**గత అనుభవంతో భవిష్యత్ ప్రణాళిక**

మూడు దశాబ్దాల క్రితం తాను ఐటీ రంగాన్ని ప్రోత్సహించినప్పుడు ఎవరూ నమ్మలేదని, కానీ ఇప్పుడు దాని ఫలాలను తెలుగువారే ప్రపంచవ్యాప్తంగా అందుకుంటున్నారని చంద్రబాబు గుర్తుచేశారు. “అప్పుడు ప్రతి కుటుంబంలో ఒక ఐటీ నిపుణుడు ఉండాలని అన్నాను. ఇప్పుడు ‘వన్ ఫ్యామిలీ, వన్ ఎంటర్‌ప్రెన్యూర్’ అనే నినాదాన్ని ఇస్తున్నాను. ఈ లక్ష్యం కూడా త్వరలోనే నెరవేరుతుంది.

ఏపీలో మీ పెట్టుబడి సురక్షితం. ఇదే సరైన సమయం, ఇప్పుడు కాకపోతే అవకాశం కోల్పోతారు” అంటూ పెట్టుబడిదారులకు పిలుపునిచ్చారు. త్వరలో అమరావతిలో క్వాంటం వ్యాలీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ టెక్నాలజీని విస్తృతంగా అమలు చేస్తామన్నారు. ఆగస్టు 15 నాటికి ప్రభుత్వ పౌరసేవలన్నీ వాట్సాప్ ద్వారానే అందిస్తామని, ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం ఉండదని ఆయన హామీ ఇచ్చారు.

## పెళ్లకూరు మండల టిడిపి అధ్యక్ష పదవిపై

# పోటీ తీవ్రతతో ఎన్నిక వాయిదా

- ముగ్గురు అభ్యర్థులు బరిలో..
- బలనిరూపణకు భారీగా వచ్చిన వాహనాలు
- జాతీయ రహదారిపై ట్రాఫిక్ అంతరాయం
- పార్టీ వర్గాల్లో ఉత్కంఠ



**పెళ్లకూరు -సూర్యా వాస్తవం, జూన్ 27:** తెలుగుదేశం పార్టీ అధ్యక్షుల ఎంపిక ప్రక్రియను సూళ్లూరుపేట నియోజకవర్గం స్థాయిలో శుక్రవారం నాడు నాయుడుపేట శ్రీనివాస కళ్యాణ మండపంలో ప్రారంభించారు. ఎంపిక కార్యక్రమాన్ని పార్టీ పరిశీలకుల సమక్షంలో ఎమ్మెల్యే నెలవల విజయ్ శ్రీ ప్రారంభించారు. మొదటి విడతగా ఓజిలి మండల అధ్యక్షుని ఎంపిక పూర్తయిన తరువాత, రెండో విడతగా పెళ్లకూరు మండల అధ్యక్ష పదవి కోసం మూడుగురు అభ్యర్థులు బరిలో ఉండటంతో పోటీ తీవ్రతకి చేరింది. అభ్యర్థులు పెద్ద ఎత్తున వారి మద్దతుదారులను తరలించడంతో సంఘటనా ప్రదేశం వద్ద భారీ జనసందోహం ఏర్పడింది. వాహనాల రాకపోకలతో జాతీయ రహదారిపై ట్రాఫిక్ ఇబ్బందులు నెలకొన్నాయి. ఇన్నిసార్లు చూసిన అభ్యర్థులపై బలనిరూపణ జరగడంతో పార్టీ పరిశీలకులు, ఎమ్మెల్యే, నియోజకవర్గ ఇంచార్జ్ కీలక నిర్ణయం తీసుకున్నారు. ప్రతి గ్రామ పంచాయతీ నుంచి ఇద్దరు లేదా ముగ్గురు నేతలకే లోపలికి అనుమతి ఇచ్చారు. విశ్వసనీయ సమాచారం ప్రకారం, గ్రామ బూత్ కమిటీల ప్రతినిధుల ద్వారా ప్రతిపాదనలు స్వీకరించగా, ఐవీఆర్ కాల్స్ ద్వారా అభిప్రాయాలు సేకరిస్తున్నారు. ప్రస్తుతం మండల అధ్యక్ష పదవిని చేపట్టిన సాంచి కృష్ణయ్య బీసీ వర్గానికి చెందినవారు. పార్టీకి అంకితభావంతో పనిచేసిన ఈయనకు మళ్లీ అవకాశం దక్కే అవకాశాలు ఉన్నప్పటికీ, యువ నాయకుడు చైతన్య కృష్ణారెడ్డికు రాష్ట్ర నాయకత్వం నుంచి మద్దతు ఉన్నట్టు తెలుస్తోంది. ఇంకొక అభ్యర్థిగా దేవారెడ్డి నాగేందర్ రెడ్డి బరిలో ఉన్నట్టు సమాచారం. ఈ ఎన్నికల పోటీ పెళ్లకూరు టిడిపి శ్రేణుల్లో ఉత్కంఠను రేకెత్తించింది.

## సంపాదకీయం

# చిన్న పార్టీలకు కాలం చెల్లినట్టేనా



జమిలి ఎన్నికలపై వ్యవహారం మెల్లగా ముందుకు కదులుతోంది. ఇప్పటికే పార్లమెంట్ ముందుకు బిల్లు తీసుకొచ్చిన కేంద్ర ప్రభుత్వం.. జాయింట్ పార్లమెంటరీ కమిటీని కూడా ఏర్పాటు చేసింది. సో ఇప్పుడు ఆ జేపీసీ సంప్రదింపుల్లో బిజీబిజీగా ఉంది. యూపీ, ఉత్తరాఖండ్‌లో పర్యటించింది. అభిప్రాయాలు తెలుసుకుంది. ఎటు చేసి వన్ నేషన్, వన్ ఎలక్షన్‌కు రోడ్ మ్యాప్ క్లియర్ చేస్తున్నట్లుగానే పరిస్థితులు చూస్తే అర్థమవుతోంది. రాష్ట్రాలకు, లోక్ సభకు ఒకేసారి ఓటు వేయాలనుకున్నప్పుడు జనం ఆలోచన ఎలా ఉండబోతోంది? 2027లో ఎన్నికలు జరిగితే 2032లో టెన్యూర్ ముగింపు. లోక్ సభతో పాటే ఎన్నికలు ఉన్న రాష్ట్రాలకు ఈ జమిలితో పదవీకాలానికి వచ్చిన ఇబ్బంది ఏమీ లేదు. కానీ వెనకా ముందు ఎన్నికలు జరిగే రాష్ట్రాల్లోనే పరిస్థితి మారబోతోంది. అంటే 2026, 2027, 2028లో జరిగే రాష్ట్రాల అసెంబ్లీలు ఐదేళ్లు ప్రశాంతంగానే ఉంటుంది. ఆ తర్వాతే కథ మారుతుంది. అంటే 2027లో అసెంబ్లీ ఎన్నికలు జరిగితే.. ఆ టెన్యూర్ 2032లో ముగుస్తుంది. అంటే 2034లో జమిలి వస్తే.. రెండేళ్లకే పదవీకాలం ముగిసిపోతుంది. అంటే 2032లో ఎలక్షన్ జరిగితే 2034లో డిజాల్వ్ కావాల్సిందే అన్న మాట. సో అక్కడ కొంచెం ఇబ్బందికర పరిస్థితులు ఉంటాయి. ఇక 2033లో రాష్ట్రాల అసెంబ్లీలకు ఎన్నికలు నిర్వహించాల్సి వస్తే అప్పుడు ఏం చేస్తారన్నది ఇంట్రెస్టింగ్ గా మారుతోంది. ఆపద్ధర్మ సీఎంగా ప్రకటించి ఏడాది కొనసాగిస్తారా.. లేదంటే రాష్ట్రపతి పాలన విధిస్తారా అన్నది కీలకంగా మారింది. ఎందుకంటే ఏడాది వ్యవధిలోనే రెండుసార్లు ఎన్నికలు అంటే ఖర్చు భారమే. ఓటర్లకు కూడా ఇబ్బందికరమే. యూపీ, పంజాబ్, మణిపూర్, గోవా ఎన్నికలు. 2027లో గుజరాత్, హిమాచల్, ఉత్తరాఖండ్, యూపీ, పంజాబ్, మణిపూర్, గోవాలో ఎన్నికలు ఉన్నాయి. వీటి టెన్యూర్ 2032లో ముగుస్తుంది. అంటే రెండేళ్ల కోసం మళ్లీ ఇక్కడ ఎలక్షన్ జరపాల్సి ఉంటుంది. ఇక 2028లో రాజస్థాన్, మధ్యప్రదేశ్, ఛత్తీస్ గఢ్, తెలంగాణ, మిజోరాంలో అసెంబ్లీ ఎన్నికలు జరుగుతాయి. 2033 వరకు టెన్యూర్ ఉంటుంది. ఆ తర్వాత ఈ అసెంబ్లీ పదవీకాలాన్ని ఏడాది పాటు అంటే 2034లో జరగబోయే జమిలి ఎన్నికల వరకు పొడగించే అవకాశం ఉంటుంది. ఆపద్ధర్మ ప్రభుత్వాన్ని కంటిన్యూ చేసే ఛాన్స్ ఉంది. అసోం, కేరళ, తమిళనాడు, బెంగాల్ కు మూడేళ్ల పదవీకాలం దొరకనుంది. సో రాష్ట్రాల్లో పరిస్థితులు పూర్తిగా మారుతాయి. ఈవీఎంలు పెంచుకోవాల్సిన అవసరం. పార్లమెంటులో బిల్లును ఆమోదించడానికి విస్తృతమైన చర్చ అవసరం. రాజ్యాంగం, చట్టాలు, రూల్స్ అన్నీ ఒకే అయ్యాక అప్పుడు మరో సవాల్ మొదలవుతుంది. లాజిస్టిక్, ఆర్థిక సవాళ్లు ఎదురవుతాయి. కేంద్ర ఎన్నికల సంఘం ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషిన్ల సంఖ్యను రెట్టింపు చేసుకోవాలి. అలాగే ఏకకాలంలో ఎన్నికలు నిర్వహించడానికి మౌలిక సదుపాయాలను అప్‌గ్రేడ్ చేయాలి. ఒకేసారి ఎన్నికలు జరిగితే కొత్త ఇవిఎంల కోసం ప్రతి 15 సంవత్సరాలకు 10 వేల కోట్లు అవసరమని ఇఅవి అంచనా వేసింది. జమిలి పోలింగ్ కోసం చాలా మ్యాన్ పవర్ అవసరం. ఎన్నికల ఫలితాలు ఆలస్యమయ్యే ఛాన్స్ ఉందన్న వాదన ఉంది. చిన్న చిన్న ఎలక్షన్లకే హింస కట్టడి చేయలేని పరిస్థితులు కొన్ని రాష్ట్రాలు, ప్రాంతాల్లో ఉంటున్నాయి. ఒకే పార్టీ ఆధిపత్యానికి దారితీస్తుందన్న భయాలు. అయితే వన్ నేషన్ వన్ ఎలక్షన్ ప్రతిపాదనను చాలా పార్టీలు వ్యతిరేకిస్తున్నాయి. ముఖ్యంగా ఇండియా కూటమిలోని పార్టీలు వద్దేవద్దంటున్నాయి. జమిలి బిల్లు రాజ్యాంగ విరుద్ధమంటోంది కాంగ్రెస్. ఈ ప్రతిపాదన దేశంలో ఒకే రాజకీయ పార్టీ ఆధిపత్యానికి దారితీస్తుందని, రాష్ట్రాల స్వయంప్రతిపత్తిని బలహీనపరుస్తుందని కాంగ్రెస్ ఆందోళన వ్యక్తం చేసింది. ఈ ప్రతిపాదన రాష్ట్రాల స్వయంప్రతిపత్తి, అలాగే ప్రాంతీయ సమస్యలు నిర్లక్ష్యానికి గురవుతాయని సమాజ్ వాదీ పార్టీ అంటోంది. అటు తృణమూల్ కాంగ్రెస్ కూడా జమిలి ఎన్నికలకు వ్యతిరేకమే అన్నది. రాష్ట్ర సమస్యలను డామినేట్ చేస్తాయన్న చర్చ. ఇది ప్రాంతీయ పార్టీలకు నష్టం కలిగిస్తుందని, జాతీయ సమస్యలు రాష్ట్ర స్థాయి సమస్యలన డామినేట్ చేస్తాయని వాదిస్తోంది. ఈ ప్రతిపాదన సమాఖ్య వ్యవస్థను బలహీనపరుస్తుందనుకుంటున్నారు. డీఎంకే కూడా జమిలి బిల్లును వ్యతిరేకించింది. ఇది రాష్ట్రాల హక్కులను కాలరాస్తుందని, ప్రాంతీయ పార్టీలకు ప్రతికూలంగా ఉంటుందని వాదిస్తోంది. జాతీయ పార్టీలు ఆధిపత్యం చెలాయించే అవకాశం ఉంటుందన్న ఆందోళన డీఎంకేలో ఉంది. శివసేన ఉద్ధవ్ బాలాసాహెబ్ ఠాక్రే జఖ పార్టీ, ఆర్జేడీ కూడా వ్యతిరేకంగా ఉన్నాయి. ప్రజాధనం ఆదా, ప్రభుత్వ ఖజానాకు మేలన్న కేంద్రం. అయితే కేంద్ర ప్రభుత్వం మాత్రం ఒకేసారి ఎన్నికలు నిర్వహిస్తే ప్రజాధనం ఆదా అవుతుందని, ప్రభుత్వ ఖజానాకు మేలు జరుగుతుందంటున్నారు. మాటి మాటికి ఓట్లు వేయాల్సిన పని జనానికి తప్పుతుందంటున్నారు. అలాగే ప్రజలు, ప్రభుత్వం, అధికారుల సమయం ఆదా అవుతుందని చెబుతున్నారు. ఒక్కసారి ఎన్నికలు జరిగి ప్రజామోదంతో ప్రభుత్వం ఏర్పాటు చేసే వారు. పాలసీ మేకింగ్ పై పూర్తిస్థాయి ఫోకస్ పెట్టేందుకు ఛాన్స్ ఉంటుందంటున్నారు. మాటిమాటికీ వచ్చే ఎన్నికల కోడ్‌తో అభివృద్ధి పనులకు బ్రేక్ పడకుండా ఉంటుందంటున్నారు.

అంతే కాదు.. ఒకేసారి ఎంపీ, ఎమ్మెల్యే, స్థానిక సంస్థలకు ఓటు వేయడం అంటే.. జనం కూడా ఆసక్తిగా పోలింగ్ కేంద్రాలకు వస్తారని దీంతో ఓట్ల శాతం పెరుగుతుందన్న లాజిక్స్ వినిపిస్తున్నారు. ఒకేసారి పోలింగ్ అంటే జనంలో ఆసక్తి. ఇక వేర్వేరుగా జరిగే పోలింగ్ తో బ్లాక్ మనీ పెరుగుతుందని, జమిలితో ఆ నల్లధనం ప్రవాహానికి చెక్ పడుతుందంటున్నారు. తక్కువ గ్యాప్ లో ఎన్నికలు జరుగుతుంటే.. దీర్ఘకాల లక్ష్యాలపై ప్రభుత్వాలు పని చేయవని, ఓటర్లను ఆకట్టుకునే తక్కువ ప్రయోజనాలు కల్పించే పనులు చేసేందుకే మొగ్గుచూపుతాయన్న వాదనను ఇంకొందరు వినిపిస్తున్నారు. కేంద్రపాలిత ప్రాంతాల బిల్లుకు ఉభయ సభల్లో సాధారణ మెజారిటీ అవసరం కాగా, రాజ్యాంగ సవరణ బిల్లు ఆమోదం పొందాలంటే లోక్‌సభ అలాగే రాజ్యసభ రెండింటిలోనూ మూడింట రెండొంతుల మంది సభ్యుల మద్దతు అవసరం. జమిలితో జవాబుదారీతనం తగ్గుతుందన్న వాదన. సో ఓవరాల్ గా చూస్తే.. చిన్న, ప్రాంతీయ పార్టీలు.. జాతీయ పార్టీలతో పోటీ పడలేవని దీనివల్ల వాటి రాజకీయ ప్రాతినిధ్యం తగ్గే అవకాశం ఉందంటున్నారు. ఎన్నికలు తరచూ జరగడం వల్ల ప్రభుత్వాలు ప్రజలకు జవాబుదారీగా ఉంటాయని, కానీ జమిలి ఎన్నికల వల్ల ఈ జవాబుదారీతనం తగ్గుతుందని ప్రతిపక్ష పార్టీలు వాదిస్తున్నాయి. ప్రభుత్వాలు నడిపే పార్టీలకు భయం లేకుండా పోతుందంటున్నాయి. సో జమిలి బిల్లుపై ఏర్పాటైన జేపీసీ ఛైర్మన్ పీపీ చౌదరి నేతృత్వంలోని 39 మంది సభ్యుల ప్యానెల్ రాబోయే రెండున్నరేళ్లలో అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు వెళ్లి మరింతగా సంప్రదింపులు పూర్తి చేయబోతోంది. అంటే జమిలికి వ్యతిరేకంగా ఉన్న పార్టీలను ఒప్పించే లక్ష్యంతో ఉన్నారు.

# లడ్డులో కెమికల్‌తో కూడిన ఆయిల్

## - తేల్చి చెప్పిన దర్యాప్తు బృందం



**తిరుమల– సూర్య వాస్తవం**

టీటీడీ లడ్డూ వివాదం ఒక కొలిక్కి వచ్చేలా కనిపిస్తోంది. గత కొద్ది రోజులుగా ప్రత్యేక దర్యాప్తు బృందం విచారణ చేపడుతున్న సంగతి తెలిసిందే. వైయస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో తిరుమల లడ్డులో జంతు కొవ్వు కలిపారని సీఎం చంద్రబాబు ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ తర ుణంలో ఇది పెను వివాదానికి దారి తీసింది. దీంతో సుప్రీంకోర్టు స్పందించి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ అధికారులతో సంయుక్తంగా ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని నియమించింది. గత కొద్ది నెలలుగా ఈ బృందం తిరుమల కేంద్రంగా విచారణ చేపట్టింది. లడ్డు వివాదానికి సంబంధించి విచారణ ఒక కొలిక్కి తెచ్చే ప్రయత్నం జరిగింది. అయితే శ్రీవారి లడ్డు తయారీకే కాకుండా.. రాష్ట్రవ్యాప్తంగా ప్రముఖ దేవాలయాల్లో సైతం ప్రసాదం తయారీకి కల్తీ నెయ్యి సరఫరా జరిగిందని ఈ ప్రత్యేక దర్యాప్తు బృందం కోర్టుకు నివేదించడం విశేషం. కొద్ది రోజులుగా సిబిఐ అధికారి నేతృత్వంలో ఈ విచారణ కొన సాగుతోంది. అయితే ఇటీవల విచారణ నివేదికను హైకోర్టుకు అందించింది ఈ బృందం. తిరుమల తో పాటు కాణిపాకం, శ్రీకాళహస్తి, శ్రీశైలం, విజయవాడ, కనకదుర్గ, ద్వారకా తిరుమల, పెనుగంచిప్రోలు తిరుపతమ్మ ఆలయాల్లో ప్రసాదం తయారీకి కల్తీ నెయ్యి సరఫరా జరిగిందని తమ దర్యాప్తులో తేలినట్లు సిబిఐ అడ్వకేట్ హైకోర్టుకు నివేదించారు. అయితే ఇది కల్తీ నెయ్యి అనడం కంటే ఆవు నెయ్యి పేరుతో పామాయిల్ లో కెమికల్స్ కలిపి ఆవు నెయ్యిల కనబడేలా, సువాసన వచ్చేలా చేసి ప్రసాదాలకు సరఫరా చేశారని కోర్టుకు నివేదించారు. దీంతో జంతువు అనే పదం రాకుండా.. పామాయిల్ అని నివేదించడం ఈ కేసులో కీలక పరిణామంగా భావిస్తున్నారు. భక్తుల ఆందోళన తిరుమలలో తయారీకి వినియోగించే నెయ్యిలో జంతువు కలిసిందనే వార్త యావత్ ప్రపంచంలో ఉన్న శ్రీవారి భక్తులను కలచివేసింది. అయితే దీనిపై వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ స్పందించింది. సుప్రీంకోర్టులో పిటిషన్ వేసింది. రాజకీయ దురుద్దేశంతోనే కూటమి ప్రభుత్వం తిరుమలలో జంతువు కలిపారని ఆరోపిస్తున్నారని.. నిష్పక్షపాత విచారణ జరగాలని టీటీడీ పూర్వపు అధ్యక్షుడు వైవి సుబ్బారెడ్డి పిటిషన్ వేశారు. దీనిపై స్పందించిన అత్యున్నత న్యాయస్థానం దర్యాప్తు కోసం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ అధికారులతో ప్రత్యేక బృందాన్ని నియమించింది. దీనికి సిబిఐ అధికారి నేతృత్వం వహిస్తున్నారు. అయితే ఇప్పటికే దీనికి సంబంధించి చాలా మంది అరెస్టులు కూడా జరిగాయి. అయితే ఇప్పుడు కేసు తుది దశకు చేరుకుంటోంది. నెయ్యిలో కల్తీ అయితే జరిగిందని అది పామాయిల్ తో కూడిన కెమికల్ అని ప్రాథమికంగా నిర్ధారణ అయింది. కానీ అసలు విషయంపై క్లారిటీ రానుంది కొద్ది రోజుల్లో.. అంతవరకు వెయిట్ చేయక తప్పదు.

# రీకాలింగ్ చంద్రబాబూస్ మ్యానిఫేస్టో

## - కొత్త ప్లాన్‌లతో జగన్ వ్యూహాలు




**విజయవాడ – సూర్య వాస్తవం**

వైసీపీ అధినేత వైఎస్ జగన్ మానసికంగా సిద్ధమైనట్లు కనిపిస్తుంది. తనను జైలుకు పంపడానికి కూటమి ప్రభుత్వం రెడీ అవుతుందని భావిస్తున్నారు. అందుకోసమే ఐదు వారాల పాటు ఉద్యమ కార్యాచరణను ప్లాన్ చేశారు. నేతలను నియోజకవర్గాలలో యాక్టివ్ చేయడానికి సిద్ధం చేస్తున్నారు. ఇకపై తన పర్యటనలపై కూడా ఆంక్షలు ఖచ్చితంగా ఉంటాయని భావించిన జగన్ నియోజకవర్గాల్లోనే జనం వద్దకు నేతలను పంపి వారిని నాలుగేళ్ల ముందే ఎన్నికలకు సిద్ధం చేయాలని రెడీ అవుతున్నారు. అయితే నాలుగేళ్ల ముందు నుంచి నేతలు ఏ మేరకు గ్రౌండ్ లెవెల్ లోకి కాలు మోపుతారన్నది మాత్రం ఇంకా స్పష్టత రాలేదు. జగన్ వస్తే తప్ప నేతలు కదలని పరిస్థితులున్నాయి.

ఒకవైపు మద్యం కేసు, మరొక వైపు సింగయ్య మృతి కేసు ఇలా వరస కేసులు జగన్ ను చుట్టుముట్టేలా కనపడుతున్నాయి. మద్యం కేసులో ఇప్పటికే తొమ్మిది మందిని అరెస్ట్ చేసిన స్పెషల్ ఇన్విస్టిగేషన్ టీం మోహిత్ రెడ్డిని విచారించనుంది. ఆ తర్వాత మిధున్ రెడ్డి అరెస్ట్ అయ్యే అవకాశాలున్నాయి. చివారఖరుగా జగన్ వైపు సిట్ చూసే అవకాశముందన్న ప్రచారం జోరుగా సాగుతుంది. మరొక వైపు ఇదే కేసులో ఎన్ ఫోర్స్ మెంట్ డైరెక్టరేట్ అధికారులు కూడా ఈ కేసును సీరియస్ గా తీసుకుని మద్యం కుంభకోణం ద్వారా అందిన నిధులను మనీలాండరింగ్ చేసినట్లు కూడా ఈడీ తన కోణంలో దర్యాప్తు చేస్తుంది. మద్యం కుంభకోణంలో వచ్చిన నగదును కొంత భాగం మొన్నటి ఎన్నికలకు వినియోగించారని సిట్ దర్యాప్తులో వెల్లడయింది.

నేతలను అరెస్ట్ చేసినంత మాత్రాన పార్టీ బలహీనం కాదు. అదే పార్టీ అధినేత ను కేసుల్లో ఇరికిస్తే నేతల నుంచి క్యాడర్ వరకూ భయపడే అవకాశ ముం దని భావించి త్వరలోనే జగన్ అరెస్ట్ జరగవచ్చన్న ప్రచారం ఏపీ వ్యాప్తంగా చర్చజరుగుతుంది. దీంతో పాటు జగన్ కూడా అరెస్ట్ కావడానికి మానసికంగా సిద్ధంగానే ఉన్నారు. అందుకే ప్రతి సమావేశంలో అక్రమ కేసులు పెట్టి జైల్లో వేస్తే మూడు నాలుగు నెలల తర్వాత బెయిల్ పై బయటకు వస్తామని, భయపడేది లేదని చెబుతుండటం ఇందుకు అద్దం పడుతుంది. అందుకే జగన్ కూటమి పాలనకు ఏడాది పూర్తయిన సందర్భంలో చంద్రబాబు సర్కార్ పై నేరుగా ప్రత్యక్ష యుద్ధానికి సిద్ధమయ్యారని కనపడుతుంది. దాదాపు నలభై రోజుల పాటు సాగే రీకాలింగ్ చంద్రబాబూస్ మ్యాని ఫేస్టో తర్వాత మరొక కార్యక్రమంతో జనం ముందుకు వెళ్లాలని జగన్ టీం ప్లాన్ చేసుకున్నట్లు కన పడుతుంది. అందు కోసం వరసగా ఇప్పటికే వివిధ వర్గాల ప్రజలకు అండగా నిలుస్తూ వారికి మద్దతుగా ఒకదాని వెంట మరొకటి కార్యక్రమాన్ని చేప ట్టాలని నిర్ణయించినట్లు కన పడు ంతుంది. ఇప్పటికే జగన్ టీం దీనికిసంబంధించిన ప్రణాళికలను సిద్ధం చేసినట్లు తెలిసింది. ఒకవేళ తాను జైలుకు వెళ్లినా నేతలు ఆ కార్యక్రమాలను అమలు చేసేలా ప్లాన్ చేయాలని ముఖ్యనేతలకు జగన్ ఇప్పటికే సూచించినట్లు తెలిసింది. ఏడాది ముందు నుంచే పదకొండు సీట్లు వచ్చినా క్యాడర్ లో నీరసం ఆవరించకుండా వివిధ పర్యటనలు చేస్తున్న జగన్ పార్టీకి ఊపు తేవడమే కాకుండా ప్రాణం పోయడానికి మరి తాజా కార్యక్రమాలు ఏ మేరకు పనిచేస్తాయన్నది వేచి చూడాలి.

# అఖండ గోదావరి ప్రాజెక్ట్ అంటే ఏంటీ

**రాజమండ్రి – సూర్య వాస్తవం**

2027 గోదావరి పుష్కరాల నాటికి రాజమండ్రిని డెవలప్ చేసేందుకు దాదాపు 95 కోట్లతో టూరిజం శాఖ అభివృద్ధి పనులు చేపట్టింది. దీనికి కేంద్ర సహాయం కూడా లభిస్తోంది. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ స్వయంగా రాజమండ్రిలో దీనికి శంకుస్థాపన చేశారు. ఇంతకూ అఖండ గోదారి ప్రాజెక్టు అంటే ఏమిటి? రాజమండ్రిలో ఏ ఏ ప్రాంతాల అభివృద్ధి చేస్తారు..రాజమండ్రిలోని గోదావరి తీరానికి పుష్కర్ ఘాట్ అనేది ఒక ఐకాన్ గా మారిపోయింది. ఎలాంటి సాంస్కృతిక కార్యక్రమమైనా పుష్కర్ ఘాట్ లోనే జరగుతోంది. అఖండ గోదావరి ప్రాజెక్టులో భాగంగా రాజమండ్రి పుష్కర్ ఘాట్ శాశ్వత ఆధ్యాత్మిక కేంద్రంగా మార్చనున్నారు.చారిత్రక నగరంగా పేరొందిన రాజమహేంద్రవరంలో 127 ఏళ్ల చరిత్ర గలిగి వారసత్వ సంపదకు ప్రతీకగా నిలిచిన ప్రతిష్టాత్మక హేవలాక్ వంతెన పునర్నిర్మించనున్నారు.దీన్ని ఒక మల్టీ ఫంక్షనల్ టూరిస్ట్ హబ్‌గా తీర్చిదిద్దాలని ప్రణాళికలు సిద్ధం చేశారు. ఈ క్రమంలో చారిత్రక, సాంస్కృతిక, వినోద కార్యక్రమాలకు వేదికగా దీన్ని మార్చేస్తారు. 2.7 కి.మీ ల పొడవైన వంతెనపై ఒక్కొక్కటి 48 మీటర్ల విస్తీర్ణంలో 57 స్పాన్‌లు ఉన్నాయి.. వీటిలో 18 స్పాన్‌లను అభివృద్ధి చేస్తారు.

- హేవలాక్ వంతెన ప్రాంతంలో జలపాతాలు, గ్లాస్ వంతెనలు, గేమింగ్ జోన్, స్పేస్ థీమ్, అర్బన్ హాట్ క్రాఫ్ట్ బజార్, హ్యాంగింగ్ గార్డెన్స్, హాలోగ్రామ్ జూ, టైమ్ ట్రావెల్, రైల్ మ్యూజియం, ఆక్వేరియం టన్నెల్ లు ఏర్పాటు చేసి అభివృద్ధి చేయనున్నారు.
- 100 మీటర్ల విస్తీర్ణంలో ఆకర్షణీయమైన జలపాతాలు, వాటర్ స్ప్రేలు, నీటి మీద తేలుతూ ప్రయాణించేలా వినూత్నమైన క్యాస్కేడింగ్ ఫౌంటెన్ డిజైన్లు, లైట్ అండ్ సౌండ్ షోలు ఏర్పాటు చేయడం ద్వారా పర్యాటకులకు మధురమైన అనుభూతిని కల్పించనున్నారు.

**విదేశాల తరహా గాజు వంతెన:**

100 మీటర్ల గాజు వంతెన ఏర్పాటు చేసి పర్యాటకులకు పగిలిన గాజుపై నడిచే అనుభూతిని అందించనున్నట్టు పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. పర్యాటకుల భద్రతతో పాటు వారు మంచి అనుభూతికి లోనయ్యేలా గాజు వంతెనను తీర్చిదిద్దనున్నారు

- ట్రెజర్ హంట్స్, వీడియో గేమ్ లు, ఇంటరాక్టివ్ ఫన్ వంటి కార్యక్రమాలతో అన్ని వయస్సుల వారు ఆనందంగా గడిపేలా 100-మీటర్లలో గేమింగ్ జోన్ ఏర్పాటు చేయనున్నారు. కుటుంబం, స్నేహితులతో సరదాగా గడిపులా, కొత్త నైపుణ్యాలు నేర్చుకునేలా దీన్ని తీర్చిదిద్దనున్నట్టు దుర్గేష్ అన్నారు.
- భారతదేశ అంతరిక్ష విజయాల నుంచి ప్రేరణ పొందిన అంతరిక్ష పరిశోధన నేపథ్య ప్రాంతంగా ప్లానిటోరియం స్పేస్ థీమ్ ఉండనుంది. తద్వారా సందర్శకులు సున్నా గురుత్వాకర్షణను అనుభూతి పొందడం, నక్షత్రరాశులను అన్వేషించడం, విశ్వం గురించి తెలుసుకోవడం వంటి అంశాలు నేర్చుకునేందుకు వీలు కలుగుతుంది. అంతేగాక అంతరిక్ష ఔత్సాహికులకు ఇది విద్యాపరమైన జ్ఞానాన్ని అందించేందుకు అవకాశం ఉంది

**అర్బన్ హ్యాట్ క్రాఫ్ట్ బజార్ :**

- ఆంధ్రప్రదేశ్ సాంస్కృతిక వారసత్వాన్ని చాటిచెప్పేలా రంగు రంగులతో కూడిన సుమారు 100 స్టాల్స్‌తో క్రాఫ్ట్ బజార్ ఏర్పాటు చేయనున్నాం. తద్వారా పర్యాటకులకు స్థానిక కళలు, హస్తకళలు, సాంప్రదాయ వంటకాలు, సంగీతంతోపాటు ఉల్లాసంగా, ఉత్సాహంగా గడిపేలా మరుపురాని వినోదం అందించనున్నారు

**హ్యాంగింగ్ గార్డెన్స్:** వివిధ రకాల వృక్ష జాతులను ప్రదర్శించే కడియం నర్సరీల నుంచి ప్రేరణ పొంది హ్యాంగింగ్ గార్డెన్స్ ను ఏర్పాటు చేయనున్నట్టు పర్యాటక మంత్రి దుర్గేష్ అన్నారు. తద్వారా సందర్శకులు బొటానికల్ నైపుణ్యాలను అన్వేషించడంతోపాటు ఉద్యానవనాల పెంపకం గురించి తెలుసుకునేందుకు అవకాశం కలుగుతుంది. అంతేగాక ప్రకృతితో పర్యాటకులు మమేకం అవుతారు.



హాలోగ్రామ్ సాంకేతికతను ఉపయోగించి వన్యప్రాణులను ప్రదర్శించే విధంగా హాలోగ్రామ్ జూను ఏర్పాటు చేయనున్నారు. దీని వల్ల వందల జంతుజాతులను వర్చువల్ విధానంలో చూసేలా, సంభాషించేలా అనుభూతిని అందిస్తుంది. జీవుల పరిణామ క్రమం, జంతువులు సజీవంగా ఉన్నట్లు ప్రతిబింబించేలా జూ ఏర్పాటు కానుంది.

**టైమ్ ట్రావెల్:** సమయ ప్రయాణాన్ని అన్వేషించేలా ఆర్టిఫీషి యల్ ఇంటలిజెన్స్ (ఎ–ఆధారిత థీమ్‌ను సందర్శకులకు అందుబాటులోకి రానుంది. తద్వారా పర్యాటకులు భవిష్యత్ కాలాన్ని సందర్శించేలా, విభిన్న కాలాల్లో ప్రయాణం చేస్తున్నట్లు అనుభూతి కలిగించేలా ఏర్పాట్లు చేయనున్నారు.

**రైల్ మ్యూజియం:** సందర్శకులకు భారతీయ రైల్వే చరిత్రను తెలిపేలా రైల్ మ్యూ జియం అందుబాటులోకి తీసుకురానున్నారు. తద్వారా రైల్వే ప్రాముఖ్యత, రైల్ ప్రయాణం, సాంకేతిక పురోగతితో రైల్వేలో వచ్చిన పురోగతి, సాంస్కృతిక చరిత్రను తెలుసుకోవచ్చును.

**అక్వేరియం టన్నెల్:** అక్వేరియం టన్నెల్ ఏర్పాటు ద్వారా సందర్శకులు పారదర్శకంగా ఉండే టన్నెల్ గుండా ప్రయాణించి లైటింగ్, సౌండ్‌తో కూడిన నిర్మలమైన వాతావరణంలో సముద్ర జీవనాన్ని అనుభూతి చెందేందుకు చర్యలు తీసుకోనున్నారు

థీమాటిక్ జోన్‌లకు ఆనుకుని సందర్శకులకు అవసరమైన సౌకర్యాలను అందించేలా 10 బఫర్ స్పేస్‌లు ఏర్పాటు చేస్తున్నారు. అందులో ప్రధానంగా ప్రతి బఫర్ జోన్ లో 10 స్టాల్స్‌తో ఉండేలా 5 ప్రత్యేకమైన ఫుడ్ కోర్టులు ఏర్పాటు చేస్తారు. అక్కడ స్థానికంగా ప్రఖ్యాతి పొందిన వంటకాలతో పాటు అంతర్జాతీయ వంటకాలు అందుబాటులో ఉంచుతారు. పర్యాటకులు విశ్రాంతి తీసుకునేలా సీటింగ్ ప్రాంతాలు, రెస్ట్ రూమ్ లతోపాటు మరుగుదొడ్లు ఏర్పాటు చేయనున్నారు

కుటుంబంతో, స్నేహితులతో సరదాగా గడిపేలా టాయ్ ట్రైన్ సర్వీస్ ను అందుబాటులోకి తీసుకురానున్నారు

సందర్శకులకు చిరకాలం గుర్తుండేలా సెల్ఫీ పాయింట్ లు ఏర్పాటు చేస్తున్నారు. తద్వారా ఫోటోలు దిగేందుకు ఆసక్తి ఉండే వారికి జ్ఞాపకాలను పదిలం చేసుకునేందుకు ఉపయోగ పడనున్నాయి.

# నగరంలో అంధకారం

- విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం
- రాత్రిపూట వెలగని దీపాలు
- రోడ్డు ప్రమాదాలకు కారణం..!
- ఇబ్బందుల్లో స్థానిక ప్రజలు




**అనంతపురం క్రైం - సూర్య వాస్తవం :** విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం కారణంగా అనంతపురం ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.విద్యుత్ అధికారులు పర్యవేక్షణ లోపం సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా అనంతపురం నగరంలో ప్రధాన కూడలి స్థానిక సర్వజన ఆస్పత్రి వద్ద పట్టపగలే వీధి దీపాలు వెలుగుతూ రాత్రి అయితే వెలగక విద్యుత్ శాఖ నిర్లక్ష్యాన్ని ఎత్తి చూపుతున్నాయి. సాయంత్రం 6 దాటితే నగరంలో వీధి దీపాలు వెలగకపోవడంతో అంధకారం అలముకుంటోంది. రహదారిపై కూడా ఇదే పరిస్థితి నెలకొనడంతో తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయనీ స్థానిక ప్రజలు, వాహనచోదకులు చెబుతున్నారు. నగరంలోనే ముఖ్య రహదారి కావడంతో వీధి దీపాలు లేకపోవడం వల్ల రాత్రి వేళల్లో రోడ్లపై దృశ్యమానత తగ్గి ఇది డ్రైవర్లకు రోడ్డును చూడటం కష్టతరం కావడంతో ప్రమాదాలు చోటు చేసుకోవచ్చు.ముఖ్యంగా వీధి దీపాలు పగటిపూట కూడా వెలుగుతూ ఉండడం,రాత్రిపూట వెలగకపోవడం మరమ్మ తులు చేయడంలో జాప్యం వంటి సమస్యలు ఉన్నాయి. రాత్రి సమయంలో వీధి దీపాలు కూడా వెలగకపోవడంతో బయటకు వెళ్లాలంటే ఆసుపత్రికి వచ్చిన ప్రజలు జంకుతున్నారు. కొన్ని ప్రాంతాల్లో వీధి దీపాలు పగటిపూట వెలుగుతుండడంతో ఇది విద్యుత్ వృధా అవ్వడానికి కారణమవుతుంది. అధికారులు దీనిని పట్టించుకోవడం లేదనేవాదన వినిపిస్తున్నాయి.

**మరమ్మతులు చేయడంలో జాప్యం**

తెగిపోయిన విద్యుత్ తీగలు, ఇతర సమస్యలను సరిచేయడంలో జాప్యం జరుగుతోంది. దీనివల్ల ప్రజలు విద్యుత్ అంతరాయాలకు గురవుతున్నారు.

**విద్యుత్ ప్రమాదాలు :** అధికారుల నిర్లక్ష్యం కారణంగా విద్యుత్ షాక్ తో ప్రమాదాలు జరుగుతున్నాయి. కొందరు ప్రాణాలు కోల్పోతున్నారు, ఆస్తి నష్టం కూడా జరుగుతోంది. ఈ సమస్యల కారణంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు జోక్యం చేసుకొని విద్యుత్ సమస్యలు పరిష్కరించాలని అనంతపురం ప్రజలు కోరుతున్నారు.

## పెండింగ్‌లో ఉన్న ఉపాధి హామీ బిల్లులు చెల్లించండి

### - సిపిఎం డిమాండ్



**తాడిపత్రి- సూర్య వాస్తవం, జూన్ 27:** పెద్దపప్పూరు మండల వ్యాప్తంగాఉపాధిహామీ పనులకు సంబంధించి పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని, స్లిప్పులు ఇవ్వాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా పత్రికా సమావేశలో పెద్ద పప్పూరు సిపిఎం మండల కార్యదర్శి కుల్లాయప్ప మాట్లాడుతూ పెద్దపప్పూరు మండల వ్యాప్తంగా ఉపాధి హామీ చట్టం వ్యవసాయ కార్మికులకు గ్రామీణ ప్రాంత పేదలకు ఒక వరం లాంటిదని అలాంటి చట్టాన్ని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ చట్టాన్ని పక్కదారి పట్టిస్తున్నారని అన్నారు. అందులో భాగంగానే అనేక మార్పులను తీసుకొని వచ్చి నెలలు తరబడి చేసిన పనులకు బిల్లులు చెల్లించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. ఇప్పటికే పెద్ద పప్పూరు మండలంలో గత నాలుగు నెలల నుండి చేసినటువంటి పనులకు 7, 8 వారాల బిల్లులు చెల్లించలేదన్నారు. చట్టం ప్రకారం చేసిన పనులకు 14 రోజులలోపు బిల్లులు చెల్లించాలన్నారు. పనుల దగ్గర కనీస సౌకర్యాలు కల్పించాలని శ్రామికులకు పనిముట్లు ఇవ్వాలని స్లిప్పులు ఇవ్వాలని ఉపాధిహామీ మేట్లకు పారితోషికం చెల్లించాలని జాబ్ కార్డు కు 200 రోజులు పనులు కల్పించి రోజు వేతనం 600 రూపాయలు ఇవ్వాలని 100 రోజులు పూర్తి చేసుకున్న కుటుంబాలకు అదనంగా వంద రోజులు పనులు కల్పించాలని డిమాండ్ చేశారు. పెద్ద పప్పూరు మండల వ్యాప్తంగా ఉన్న గ్రామాలలో 270 రూపాయలకు మించి కూలి రావడం లేదని కూలీలు ఆవేదన చెందాతున్నారని చట్టం ప్రకారం ప్రస్తుతం 307 రూపాయలు కూలి రావాలని డిమాండ్ చేశారు. పెద్దపప్పూరు సిపిఎం మండల కార్యదర్శి అమ్మలదిన్నె, కుల్లాయప్ప, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు.

### ఎన్టీఆర్ గారు.... ముఖ్యమంత్రికి చెప్పండి

# మా సమస్యలు పరిష్కరించమని..

**- ఇంజనీరింగ్ కార్మికుల ఆవేదన...**




**అనంతపురం క్రైం - సూర్య వాస్తవం, జూన్ 27:** రాష్ట్రంలో 13వేల మంది మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులకు వేతనాలు పెంచాలని, సమస్యలు పరిష్కరించాలని శుక్రవారం సిఐటియు ఆధ్వర్యంలో రాష్ట్ర పిలుపుమేరకు ఆందోళనలో భాగంగా స్థానిక నగరపాలక సంస్థ నుంచి మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు ఎన్టీఆర్ విగ్రహం వరకు ర్యాలీగా వెళ్లి, ఎన్టీఆర్ విగ్రహానికి, వినతి పత్రం ద్వారా తమ గోడు వెల్లబోసుకున్నారు. ఈ కార్యక్రమానికి హాజరైన సిఐటియు నగర అధ్యక్షులు వెంకటనారాయణ మున్సిపల్ యూనియన్ నగర గౌరవాధ్యక్షులు గోపాల్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సంవత్సరం రోజులు అవుతున్న మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల సమస్యలు పరిష్కారం కాలేదని, రోజురోజుకు ధరలు పెరుగుతున్నాయని ఇంటి అద్దెలు, విద్యుత్ ఛార్జీలు, విద్యా, వైద్యం, అన్ని రకాల ధరలు పెరిగిపోయి, వస్తున్నా అర కోర వేతనాలతో బ్రతకడం కష్టంగామారిందని, రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన తల్లికి వందనంతో పాటు ఏ సంక్షేమ పథకాలు కూడా, 13వేల వేతనం వస్తుందని వీరికి వర్తించకుండా అన్యాయం చేస్తున్నారని, ఇప్పటికైనా జీఓ నెంబర్ 36 ప్రకారం రూ.21000, రూ. 24500లు జీతాలు చెల్లించాలి, షరతులు లేకుండా సంక్షేమ పథకాలు అమలు చేయాలి, వయోపరిమితి 62 ఏళ్లకు పెంచాలి, రిటైర్మెంట్ బెనిఫిట్స్ 75000, ఎక్స్ గ్రేషియో రూ. 7 లక్షలు, దహన సంస్కారాలకు రూ. 20000 జీఓలు జారీ చేయాలి. రిటైర్మెంట్ అయిన, చనిపోయిన, అనారోగ్యం పాలైన వారి స్థానంలో వారి బిడ్డలకు ఉద్యోగాలు ఇవ్వాలి, ఆప్కాస్ రద్దు చేస్తే ఉద్యోగాలు పర్మినెంట్ చేయాలి, సుప్రీంకోర్టు తీర్పు మేరకు సమాన పనికి సమాన వేతనం, గ్రాట్యుటీ అమలు చేయాలి, చట్టబద్ధమైన సెలవులు అమలు చేయాలి, కిట్లు, భద్రతా సౌకర్యాలు, సకాలంలో అందచేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఇంజనీరింగ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు మల్లికార్జున, సంజీవ రాయుడు, నగర అధ్యక్ష కార్యదర్శులు ఓబుళపతి, మురళి, కోశాధికారి పోతులయ్య, శానిటేషన్ వర్కర్స్ యూని యన్ నగర కార్యదర్శి, తిరుమలేష్, ఎర్రిస్వామి, లక్ష్మీనరసమ్మ, వరలక్ష్మి, లక్ష్మీ నారాయణ, లక్ష్మి, తులసి, వెంకటేశ్వరమ్మా, అరుణ, నరసమ్మ, తదితరులు పాల్గొన్నారు.


## ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే కఠిన చర్యలు

**- ఆదోని ట్రాఫిక్ సిఐ గంటా సుబ్బారావు**



**ఆదోని - సూర్య వాస్తవం, జూన్ 27:** ఆదోని పట్టణంలో ట్రాఫిక్‌కు అంత రాయం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని ఆదోని ట్రాఫిక్ సిఐ గంటా సుబ్బారావు హెచ్చ రిం చారు. ఆదోని పట్టణంలో ప్రధాన వీధుల్లో ట్రాఫిక్‌కు తీవ్ర అంత రాయం కలుగుతున్న నేపథ్యంలో గంటా సుబ్బారావు తన సిబ్బందితో కలిసి శుక్రవారం నాడు పర్యటించారు. విజిబుల్ పోలీసింగ్ లో భాగంగా ఎంఎం రోడ్ నుండి షరాఫ్ బజార్ రోడ్డు ఇరువైపుల ట్రాఫిక్ అడ్డంగా ఉన్న వాటిని తొలగిస్తూ. దాదా సోడా సెంటర్ దగ్గర ఉన్న ఆటో డ్రైవర్ల కు రోడ్డుమీద ఆటోలు అడ్డంగా పార్కు చేయకూడదని కౌన్సిలింగ్ ఇచ్చారు. అనంతరం తనిఖీలో భాగంగా రికార్డ్స్ సక్రమంగా లేని వాహనాలకు జరిమా నాలు విధిస్తూ వాహనదారులు వాహనాలు నడిపేటప్పుడు ఉండవలసిన రికార్డ్స్, పాటించవలసిన నియమ నిబంధనను తెలియజేశారు. దుకాణాల ముందు ఇష్టారీతిన వాహనాలు నిలపరాదని తెలిపారు.

## కడప జిల్లా టిడిపి అధ్యక్షులుని సన్మానించిన గూడూరు కిరణ్ కుమార్



**నాయుడుపేట - సూర్య వాసం, జూన్ 27:** కడప జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, పొలిట్ బ్యూరో సభ్యులు శ్రీనివాస్ రెడ్డిని ఆర్యవైశ్య యువజన సంఘం రాష్ట్ర ఉపా ధ్యక్షులు గూడూరు కిరణ్ కుమార్ ఘనంగా సన్మానించారు.కడప పట్టణం లోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డిని కిరణ్ కుమార్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు శాలువా కప్పి,పుష్పగుచ్ఛం అందజేసి సన్మానించారు. ఆర్యవైశ్యుల సమస్యలు పరిష్కారం కోసం కృషి చేయాలని శ్రీనివాస్ రెడ్డిని గూడూరు కిరణ్ కుమార్ కోరారు.

### మారణాయుధాలతో

# భార్యాభర్తలను బెదిరించి నగలు దోపిడీ

**హిందూపురం- సూర్య వాస్తవం, జూన్ 27**



హిందూపురంలో రాత్రి భార్యాభర్తలను కత్తులు, తుపాకీలు చూపించి బంధించి నగలు దోచుకెళ్లిన ఘటన చోటు చేసుకుంది. హిందూపురం మండలం కిరికెర పంచాయతీ పరిధిలో ఉన్న వెంకటాద్రి లేఅవుట్‌లో నివాసమున్న నిత్యానంద రెడ్డి ఇంటిలో గురువారం రాత్రి భారీ దోపిడీ జరిగింది. బాధితులు నిత్యానంద రెడ్డి, అతని భార్య కోమల తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. గురువారం రాత్రి 9 గంటల సమయంలో ఇంటిలో భోజనం చేస్తుండగా కారులో ఐదు మంది దుండగులు వచ్చారన్నారు. అందులో ఒకరు కారులోనే ఉండగా మరో నలుగురు ఇంట్లోకి వచ్చారని తెలిపారు. ఇంట్లోకి వచ్చిన వెంటనే మెడపై కత్తి పెట్టి తుపాకి చూపించి మెడలో ఉన్న బంగారాన్ని లాక్కున్నారని, అనంతరం నిత్యానంద రెడ్డి చేతుల కట్టేసి పూజ గదిలో బంధించి తాళం వేశారు. అతని భార్య కోమలను మరో గదిలో బంధించారు. అక్కడే వారి తల్లిదండ్రులు నరసారెడ్డి, లక్ష్మీ దేవమ్మ , చిన్న పిల్లలు ఉండగా వారిని గదిలో కూర్చోమని చెప్పారు. బీరువాలో ఉన్న బంగారు నగలను ఎత్తుకెళ్లారు. అయితే వెళ్తూ ఈ విషయం పోలీసులకు చెబితే మీ కుమారుని చంపేస్తామని హెచ్చరించి వెళ్లారు. వారు వెళ్లిపోయిన కొద్ది సేపటికి బయటికి వచ్చి పూజ గదికి వేసిన తాళం పగలగొట్టడంతో భర్త బయటికి వచ్చాడు.



ఆ తర్వాత పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వెంటనే డిఎస్పీ మహేష్, అప్ గ్రేడ్ సీఐ ఆంజనేయులు, సిబ్బంది సంఘటన స్థలాన్ని తనిఖీ చేసి ఘటన జరిగిన సమీపంలో ఉన్న సిసి ఫుటేజ్ ను పరిశీలించారు. అయితే వచ్చిన వారందరూ హిందీలో మాట్లాడారని, అంతేగాక వారిలో ఒకరిద్దరు మేము వచ్చింది ఎవరినో చంపడానికి, ఎమ్మెల్యే కుమారుడు మాకు తప్పుడు సమాచారం ఇచ్చాడని వారిలో వారు తిట్టుకున్నట్లు బాధితుడు నిత్యానంద రెడ్డి పోలీసులకు తెలిపాడు. సుమారు 25 తులాల బంగారం నగలు ఎత్తుకెళ్లినట్లు బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దొంగతనం చేసుకొని తిరిగి వెళ్లే సమయంలో ఇద్దరు మహిళలు సంబంధించిన తాళిబొట్లు వెనక్కి ఇచ్చి వెళ్లారు. మిగిలిన చైన్లను దోచుకు వెళ్ళినట్లు బాధితులు తెలిపారు. కాగా ఈ సంఘటనను పోలీసులు అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుని దర్యాప్తు సాగించేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. ఇకపోతే శుక్రవారం డాగ్ స్క్వాడ్, క్లూస్ టీం ఇక్కడకి చేరుకుని ఆధారాలు సేకరించింది. ఏదేమైనా గతంలో ఎప్పుడూ లేని విధంగా ఈ తరహా దోపిడీ జరగడం పట్ల స్థానికుల్లో తీవ్ర భయాందోళనలు వ్యక్తమవుతున్నాయి.

## మిద్దెపై నుండి పడి సిపిఐ కార్యకర్తకు తీవ్ర గాయాలు

**- పరామర్శించిన సిపిఐ పట్టణ కార్యదర్శి చిరంజీవి యాదవ్ బృందం**



**తాడపత్రి - సూర్య వాసం, జూన్ 27:** భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ తాడిపత్రి పట్టణ సమితికి చెందిన చురుకైన కార్యకర్త రవి ప్రమాదవ శాత్తు మిద్దె పైనుంచి జారీ కింద పడి రెండు కాళ్లు విరిగి లాడ్ ఆసుపత్రిలో అడ్మిట్ అయిన రవిని తాడిపత్రి పట్టణ సిపిఐ కార్యదర్శి చిరంజీవి యాదవ్, సహాయ కార్యదర్శులు, శ్రీరాములు, నాగేంద్ర, రమణ, నాగార్జున వెళ్లి రవిని పరామర్శించి ప్రమాదం ఎలా జరిగిందని అడిగి తెలుసుకోని అనంతరం సంబంధిత డాక్టర్ తో కలిసి రవి ఆరోగ్య పరిస్థితులు అడిగి తెలుసుకుని తొందరగా కోలుకునేతట్టు చికిత్స చేయండి అని డాక్టర్ తో మాట్లాడడం జరిగినది.

## పశువైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలి

**- పశు సంవర్ధకశాఖ వైద్యాధికారి విజయరాజు**



**సిద్ధవటం – సూర్య వాస్తవం, జూన్ 27:** పాడి రైతుల గేదెలు, మేకలు ఆరోగ్య సమస్యలపై చికిత్సలు చేసేందుకు పశు సంవర్ధకశాఖ సిబ్బంది అందుబాటులో ఉండాలని మాచుపల్లి పశు సంవర్ధకశాఖ వైద్యాధికారి విజయరాజు తెలిపారు. మండలంలోని మాచుపల్లి పశు వైద్యశాలలో జ్యోతి, టక్కోలు, వంతాటి పల్లె గ్రామాలకు చెందిన పశు వైద్య సిబ్బందితో ఆయన శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాడి రైతులు అనారోగ్యాలతో వైద్యశాలకు తీసుకొచ్చిన గేదెలు, మేకలకు చికిత్సలు అందించేందుకు సిబ్బంది అందుబాటులో ఉండి చికిత్స సేవలు అందించాలన్నారు. నట్టల నివారణ కార్యక్రమం జూన్ 26 నుండి జూలై 10 వరకు జరుగుతుందని రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పశు సంవర్ధకశాఖ వైద్య సిబ్బంది జిలాని భాష, భారతి, మహబూబ్ బాషా, గోపాలమిత్ర, నరసింహులు పాల్గొన్నారు.

## ప్రత్యేక అలంకరణలో కన్యాకాపరమేశ్వరి అమ్మవారు



**పామిడి – సూర్య వాస్తవం, జూన్ 27:** పామిడి పట్టణం లోని వాసవి కన్యాకాపరమేశ్వరి అమ్మవారిని శంకంబరి అలంకరణ లో శుక్రవారం తీర్చి దిద్దారు. వివిధ రకాల ఆకు కూరలు, కూరగాయలు, పళ్లతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఆషాడ మాసం తొలి శుక్రవారం సందర్భంగా అష్టోత్తర శత నామవాళి కుంకుమ అర్చన, భక్తిగీత లాపన, ప్రాకరోత్సవం, నిర్వహించారు. భక్తులందరికి ప్రజలకు పరిపూర్ణ ఆహారం లభించేందుకు ఈ అలంకరణ చేస్తారు. ఆహారం కావాలంటే వర్షం అవసరం. అందుకే ఈ అలంకరణ చేసి పూజలు చేస్తారు. వాసవి మాతృమండలి వారు ఈ కార్యక్రమం చేపట్టారు. మాతృ మండలి అధ్యక్షులు ఎన్ వి ఎస్. నాగవల్లి, కార్యదర్శి కీర్తి, గౌరవ అధ్యక్షులు రాజేశ్వరి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. అందరికీ మహమంగళ హారతి అనంతరం అల్పాహారం అందించారు. ఆర్యవైశ్య సంఘం వారు పర్యవేక్షించారు.

## టీడీపీ పట్టణ కన్వీనర్‌గా మోహన్ కృష్ణ



**పామిడి – సూర్య వాస్తవం, జూన్ 27:** పామిడి టీడీపీ పట్టణ కన్వీనర్గా మోహన్ కృష్ణ శుక్రవారం ఎంపిక య్యారు. వారం రోజుల కిందట గుత్తిలో ఎమ్మెల్యే గుమ్మ నూరు జయరాం ఆధ్వర్యంలో సంస్థాగత ఎంపిక కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా మోహన్ కృష్ణను మండల కన్వీనర్గా ఎంపిక చేశారు. తనపై నమ్మకం ఉంచినాకు రెండవసారి మండల కన్వీనర్ గా అప్పగించి నందుకు ఎమ్మెల్యే కు పామిడి ఇంచార్జ్ గుమ్మనూరు ఈశ్వర్ కి అలాగే పామిడి టిడిపి నాయకులకు నాకు సపోర్ట్ చేసిన ప్రతి కార్యకర్తకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

## రాష్ట్రంలో క్రీడా అభివృద్ధికి నూతన రథసారథులు

**- మంత్రి సమక్షంలో శాప్ పాలకమండలి సభ్యుల ప్రమాణ స్వీకారం**



**రాయచోటి, విజయవాడ – సూర్య వాస్తవం, జూన్ 27:** విజయవాడ నగరంలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ (శాప్) డైరెక్టర్ల ప్రమాణ స్వీకార మహోత్సవం అట్టహాసంగా జరిగిందని. ఈ కార్యక్రమంలో రాష్ట్ర రవాణా, యువజన క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థకు నూతనంగా ఎంపికైన సభ్యుల చేత ప్రమాణ స్వీకారం చేయించారని రాష్ట్ర రవాణా, యువజన క్రీడా శాఖ మంత్రి క్యాంప్ కార్యాలయం రాయచోటి నుంచి సమాచారాన్ని తెలిపారు. సభ్యులు ఈ. రాజని, ఎ. రమణారావు, ఎం.డి. రమేశ్ కుమార్, పేరం రవీంద్రనాథ్, ఎస్. సంతోష్ కుమార్, కె. జగదేశ్వరి, బి. శివ, పి.బి.వి.ఎస్.ఎన్. రాజు (బుచ్చిరాజు). ఈ సందర్భంగా శాప్ చైర్మన్ అనిమిని రవి నాయుడు, విజయవాడ ఎంపీ కేశినేని చిన్ని, ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు, పలు కార్పొరేషన్ చైర్మన్లు శుక్రవారం ఈ వేడుకకు హాజరై కొత్త సభ్యులకు అభినందనలు తెలిపారు.



# మాదకద్రవ్యాల అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు

**- మాదకద్రవ్యాలకు సంబంధించి టోల్ ఫ్రీ నెంబర్ 1972కు ఫోన్ చేసి సమాచారం తెలియజేయండి : జిల్లా ఎస్పీ పి.జగదీష్**






**అనంతపురం క్రైం – సూర్య వాస్తవం, జూన్ 27:** మాదకద్రవ్యాలకు సంబంధించి టోల్ ఫ్రీ నెంబర్ 1972 కు సంబంధించి బోర్డు ను అన్ని ప్రభుత్వ కార్యాలయాలలో ను విద్య సంస్థ ఏర్పాటు చేయాలని జిల్లా ఎస్పీపి.జగదీష్ పేర్కొన్నారు. శుక్రవారం అనంతపురం కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా ఎన్సిఓఆర్డీ (నార్కో కోఆర్డినేషన్ సెంటర్) జిల్లా స్థాయి కమిటీ సమావేశాన్ని జిల్లా రెవెన్యూ అధికారి మలోల తో కలసి జిల్లా ఎస్పీ పి.జగదీష్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో అన్ని ప్రభుత్వ కార్యాలయాలలోను పాఠశాలలు, కళాశాలలు డిగ్రీ కళాశాలలో, ఇంజనీరింగ్ కళాశాలలో టోల్ ఫ్రీ నంబర్ 1972 బోర్డు ఏర్పాటు చేయాలని సంభందిత అధికారులను ఆదేశించారు. మాదకద్రవ్యాలు వినియోగం, అక్రమ రవాణా, అమ్మకాలు, వంటి అంశాలపై సమాచారం అందజేయాలన్న సమాచారాన్ని ప్రజలకు తెలియజేయాలన్నారు. మాదకద్రవ్యాలు వినియోగించడం వల్ల కలిగే నష్టాల పై ఫ్లయర్స్ కార్డ్స్ హెచ్ డి రూపంలో చేసి అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లోను, పాఠశాలలో కళాశాలలో డిగ్రీ కళాశాలలో, ఇంజనీరింగ్ కళాశాలలోను ప్రజల సమూహంగా ఉండే ప్రాంతాల్లో ఏర్పాటు చేసి యువత, ప్రజల్లో అవగాహన కలిగించాలని అధికారులను ఆదేశించారు. మాదకద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు తో పాటుగా జైళ్లకు పంపడం జరుగుతుందన్న సమాచారాన్ని యువత కు పూర్తి అవగాహన చేయాలన్నారు. యువత డ్రగ్స్ బారిన పడకుండా అధికారులు అందరు సమన్వయంతో పర్యవేక్షించాలని సూచించారు. మాదక ద్రవ్యల పై ఈగల్ టాస్క్ ఫోర్స్ వ్యవస్థను ఏర్పాటు ఏర్పాటు చేయడం జరిగిందని వీరు అనునిత్యం గమనిస్తూ ఉంటారని తెలిపారు. ఈ సమావేశంలో డిఎస్పీ శ్రీనివాస్ రావు, వయోవృద్ధుల సంక్షేమశాఖ ఏడి.అర్చన, జిల్లా వ్యవసాయ అధికారిణి ఉమామహేశ్వరమ్మ, ఆర్ఐఓ వెంకటరమణ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

## ఈవీఎం గోడౌన్ తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి



**రాయచోటి – సూర్య వాస్తవం, జూన్ 27:** జిల్లాకు సంబంధించి ఈవీఎంలను భద్రపరిచిన గోదాము వద్ద 24 గంటలు నిరంతరం పటిష్టమైన నిఘా ఉండాలని, ఈవీఎంల గోదామును పరిశీలించిన అనంతరం జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి సంబంధిత అధికారులను ఆదేశించారు. ఎన్నికల కమీషన్ ఆదేశాల మేరకు త్రైమాసిక తనిఖీల్లో భాగంగా రాయచోటి పట్టణం మార్కెట్ యార్డ్ లో ఉన్న ఈవీఎం గోదామును గురువారం రాజకీయ పార్టీ ప్రతినిధులతో కలిసి కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రాజకీయ పార్టీల సమక్షంలో గోదాము లోపల భద్రపరిచిన ఆయా ఈవీఎం యంత్రాలు బియులు, సియూలు, వివి ప్యాట్ లను, అక్కడి భద్రతా చర్యలను కలెక్టర్ క్షుణ్ణంగా పరిశీలన చేశారు. అనంతరం వివిధ అంశాలలో రాజకీయ పార్టీ ప్రతినిధులు అడిగిన సందేహాలకు కలెక్టర్ సమాధానం ఇచ్చారు. అనంతరం జిల్లా కలెక్టర్ తన చాంబర్లో వివిధ పార్టీల ప్రతినిధులతో ఎన్నికలకు సంబంధించిన వివిధ అంశాలపై సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జనాభా పెరిగిన చోట్ల పోలింగ్ కేంద్రాలు పెంచడం పోలింగ్ కేంద్రాల మార్పులు చేర్పులు తదితర అంశాలలో సందేహాలు, సూచనలను సంబంధిత ఈఆర్ఓలకు సమర్పించాలని పార్టీల ప్రతినిధులను కోరారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ కె. మధుసూదన్ రావు, ఆర్డిఓ ఏ. శ్రీనివాస్, తాసిల్దార్ నరసింహ కుమార్, కలెక్టరేట్ సెక్షన్ సూపరింటెండెంట్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## మన ఇంటికి మన ఎమ్మెల్యేలో కందికుంట వెంకటప్రసాద్



**కదిరి – సూర్య వాస్తవం, జూన్ 27:** రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి సవాల్ ను స్వీకరించి మన ఇంటికి మన ఎమ్మెల్యే కార్యక్రమంలో భాగంగా కదిరి మున్సిపల్ పరిధిలోని 20వ వార్డు లో శుక్రవారం పాల్గొని ప్రజాసమస్యలు పరిష్కరిస్తు కదిరి నియోజకవర్గ శాసనసభ్యులు కందికుంట వెంకటప్రసాద్ వార్డులోకి ప్రవేశించగా, అడుగడుగునా హారతులు ఇచ్చి ఎమ్మెల్యే కి స్వాగతం పలికిన మహిళలు ఘనంగా స్వాగతించారు. ప్రజా సమస్యలు తెలుసుకుంటూ ముందుకు సాగుతూ అందరినీ ఆప్యాయంగా ప్రకటిస్తూ, వార్డులోని సమస్యలను మరియు ఫిర్యాదులను స్వీకరిస్తూ ముందుకు సాగారు. సమాజమే దేవాలయం ప్రజలే దేవుళ్ళు స్ఫూర్తితో కూటమి ప్రభుత్వం సంవత్సర కాలంలో చేసిన అభివృద్ధి పై కదిరి ఎమ్మెల్యేగా గెలిచి సంవత్సర కాలం పూర్తి చేసుకున్న సందర్భంగా, నియోజకవర్గ అభివృద్ధికి గ్రామాల వారిగా చేస్తున్న కార్యక్రమాలపై వివరిస్తూ, ప్రజల నుంచి తమ దృష్టికి వచ్చిన పిర్యాదులు, సమస్యలపై ఇంటి ఇంటికి వెళ్ళి అప్యాయంగా పలకరిస్తూ ప్రజల కష్ట నష్టాలను అడిగి తెలుసుకుంటూ పరిష్కారం అయ్యే దిశగా అధికారులకు ఆదేశించి ముందుకు సాగరు ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ పట్టణ అధ్యక్షులు డైమండ్ ఇర్ఫాన్, తెలుగుదేశం పార్టీ నాయకులు ఎస్ బహవుద్దీన్, మాజీ కౌన్సిలర్ హనుమంతు, కాటం మనోజ్ కుమార్, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రభుత్వ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## డ్రాగన్ ఫ్రూట్ పంటతో అధిక ఆదాయం



**సిద్దవటం – సూర్య వాస్తవం, జూన్ 27:** డ్రాగన్ ఫ్రూట్ పంట సాగుతో అధిక లాభాలు పొందవచ్చునని రైతు మన్యం నాగార్జున నాయుడు తెలిపారు. శుక్రవారం మన్యం నాగార్జున నాయుడు అనే రైతు మాట్లాడుతూ మండలంలోని జ్యోతి గ్రామంలోని గొల్లపల్లిలో 2023 మార్చి 23వ తేదిన 2.50 ఎకరాలలో 13 లక్షల వ్యయంతో డ్రాగన్ ఫ్రూట్ పంటను సాగు చేశానన్నాడు. కర్ణాటక రాష్ట్రం నుంచి జంబో సీడ్స్ తెప్పించి నాటగా మొదటి ఏడాది 5.50 టన్నులు పంటకు దాదాపు 6 లక్షలు ఆదాయం వచ్చిందని ఈ ఏడాది 12 టన్నుల మేర పంట చేతికి అందే అవకాశం ఉందన్నారు. 12 టన్నులకు దాదాపు 15 లక్షల ఆదాయం వస్తుందని ఆశిస్తున్నామన్నారు. డ్రాగన్ ఫ్రూట్ మార్కెట్ లో 100 నుంచి 120 రూపాయలు మేర ధర ఉందన్నారు. రసాయన ఎరువులు తగ్గించి ముడి ఎరువులు వాడడం వల్ల డ్రాగన్ ఫ్రూట్ చెట్టు, కాయలు బాగుంటాయన్నారు. ఏప్రిల్, మే నెలల్లో ఎరువులు వాడాలని, మళ్ళీ నవంబర్, డిసెంబర్ నెలలో ఎరువులు వేయడం వల్ల చెట్లు బాగుండి కాయల ఉత్పత్తి బాగుంటుందన్నారు. డ్రాగన్ ఫ్రూట్ పంట సాగుకు ఒక ఏడాది అధిక ఖర్చు ఉంటుందని ఆ తర్వాత అధిక అదాయాలు పొందవచ్చునన్నారు. ఇక్కడ సాగు చేసిన డ్రాగన్ ఫ్రూట్ బాగుండడంతో కర్ణాటక రాష్ట్రం బీజాపూర్ నుంచి తనకు ఆర్డర్ వచ్చిందని పొలం వద్దే డబ్బులు చెల్లించి వారు తీసుకెళ్తారన్నారు. రైతులు డ్రాగన్ ఫ్రూట్ సాగుచేస్తే అధిక ఆదాయం పొందవచ్చునని ఆయన తెలిపారు.

## ఇసుక అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తప్పవు

**- సిద్దవటం ఎస్ఐ మహమ్మద్ రఫీ**



**సిద్దవటం – సూర్య వాస్తవం, జూన్ 27:** ఉచిత ఇసుక ముసుగులో ఇసుక అక్రమ రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని సిద్దవటం ఎస్సై మహమ్మద్ రఫీ హెచ్చరించారు. గ్రామాల నుంచి ఇసుకను జిల్లా కేంద్రానికి ట్రాక్టర్ల ద్వారా తరలింపు చేసి ఒక్కో ఇసుక ట్రాక్టర్ కు 4 వేలు తీసుకుంటున్నట్లు తమ దృష్టికి రావడంతో ఇసుక అక్రమ రవాణా జరగకుండా అడ్డుకట్ట వేశామన్నారు. మండల కేంద్రమైన సిద్దవటం పెన్నానది హై లెవెల్ వంతెన సమీపాన రైతు పంట పొలాల వద్ద నుంచి ప్రతిరోజు ఇసుకను ట్రాక్టర్ల ద్వారా అక్రమంగా కడపకు తరలిస్తున్నట్లు కొంతమంది రైతులు ఫిర్యాదు చేశారన్నారు. ఈ మేరకు శుక్రవారం ఇసుక అక్రమ రవాణా జరగకుండా పెన్నానదిలోకి వెళ్లే రహదారిని జెసిబి యంత్రాలతో గోతులు తీయించామ న్నారు. ఇసుకను గ్రామంలో ఉన్నవారు మాత్రమే గృహ నిర్మాణ పనులకుస తోలుకోవాలన్నారు. ఇసుక ఉచిత ఇసుక ముసుగులో ట్రాక్టర్ల ద్వారా కడపకు అక్రమ రవాణా చేస్తే కేసులు నమోదు చేస్తామన్నారు. ఇసుక అక్రమ రవాణాను అరికట్టేందుకు భాకరాపేట, బండి కనుమ, కమ్మపాలెం రహదారుల్లో విస్తృత తనిఖీలు చేపడతామని ఆయన పేర్కొన్నారు.

## చిన్నారులకు ఆరోగ్య పరీక్షలు

**- బాలసదనం, శిశుగృహంలో ఉచిత వైద్య పరీక్షలు**



**అనంతపురం క్రైం - సూర్య వాస్తవం, జూన్ 27:** మిషన్ వాత్సల్య పథకంలో భాగంగా శుక్రవారం రాష్ట్రీయ బాల ఆరోగ్య కార్యక్రమం (ఆర్బీఎస్ కే) లో భాగంగా జిల్లా త్వరిత చికిత్స కేంద్రం (డీఐఈసీ) ప్రత్యేక వైద్య బృందంచే బాలల సదనం, శిశు గృహంలో పిల్లల ఆరోగ్య పరీక్షలకు మెడికల్ క్యాంపు నిర్వహించారు. జిల్లా వైద్య శాఖ డీ. ఎం . హెచ్.ఓ, జిల్లా ఆర్ బీఎస్ కే కోఆర్డినేటర్ డాక్టర్ నారాయణస్వామి ఆధ్వర్యంలో బాల సదనం, శిశు గృహాల్లో ఉన్న అనాధ బాల బాలికలకు ఆరోగ్య పరీక్షలను నిర్వహించారు. చైల్డ్ కేర్ సంస్థలు, ప్రత్యేక దత్తత శిబిరాలో చికిత్స కోసం పిల్లలకు స్క్రీనింగ్ పరీక్షల క్యాంపు నిర్వహించడమైనది. ఈ కార్యక్రమంలో మొత్తం 23 మంది పిల్లలు స్క్రీనింగ్‌లో పాల్గొనగా 18 మంది పిల్లలకు 4డి సమస్యల ఉన్నట్లు గుర్తించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ జగదీష్నాయక్, ఆర్బీఎస్కె మేనేజర్ రజిత, డెంటిస్ట్ ముత్యాలమ్మ, చైల్డ్ మనస్తత్వవేత్త సిరిగిరి సుందరరావు, ఆడియాలజిస్ట్ గీత, ఆప్టోమెట్రిస్ట్ జ్ఞాన ప్రసన్న, ఇతర సిబ్బంది, బాలసదనం సూపరింటెండెంట్ పద్మ రాధిక, శిశు గృహ మేనేజర్ దీప్తి పాల్గొన్నారు.

## రక్తదానం చేయడానికి యువత ముందుకు రావాలి

**- డాక్టర్ సయ్యద్ మైనుద్దీన్**



**రాయచోటి - సూర్య వాస్తవం, జూన్ 27:** ఎదుటి వ్యక్తి ఆపదలో ఉంటే ఈ రోజుల్లో మాకెందుకులే అని పక్క నుండి వెళ్లిపోయే రోజులివి, ప్రతి ఒక్కరిలో చైతన్యం రావాలని, ప్రతి ఒక్కరూ రక్తదానం ఇవ్వడానికి ముందుకు రావాలని డాక్టర్ సయ్యద్ మెనుద్దీన్ అన్నారు. అన్నమయ్య జిల్లా కేంద్రమైన రాయచోటి పట్టణం బోస్ నగర్ ఏరియా కి చెందిన ఓ గర్భిణీ స్త్రీకి అత్యవసర సమయంలో (బిం) రక్తము అవసరం ఉండగా హెల్పింగ్ హాండ్స్ బ్లడ్ ఆర్గనైజేషన్ చైర్మన్ డాక్టర్ సయ్యద్ మైనుద్దీన్ మహమ్మద్ అనే యువకుడు రక్తదానం చేయించి పేషెంట్ వారికి అందించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేషంట్ రక్తం ఇవ్వడంలో ఎటువంటి ఇబ్బంది హానికరం ఉండదని, అర్థం ఇచ్చిన వ్యక్తి ఆరోగ్యంగా ఉంటారని చెప్పారు. అత్యవసర సమయంలో స్వచ్ఛందంగా రక్తదానం చేయడానికి ముందుకు వచ్చిన మహమ్మద్ కి ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నేషనల్ బ్లడ్ ప్రమోటర్ హెల్పింగ్ హాండ్, కమిటీ కిలక సభ్యులు మహమ్మద్, సుఫియాన్, జావీద్, రక్త నిధి సిబ్బంది పాల్గొన్నారు.


## ఇంటి వద్దకే వికలాంగులకు బియ్యం పంపిణీ



**అనంతపురం క్రైం - సూర్య వాస్తవం, జూన్ 27:** రుద్రంపేట పంచాయతీ చంద్రబాబు నగర్ పరిధిలోని 62 నంబర్ స్టోర్ డీలర్ ఎస్ ఎం బాషా శుక్రవారం వృద్ధులకు, వికలాంగులకు ఇంటి దగ్గరకు వెళ్లి ప్రభుత్వ బియ్యం పంపిణీ చేశారు. ప్రభుత్వం ఆదేశాలు, ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ సూచనల మేరకు ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు భాషా తెలిపారు. వికలాంగులకు నాలుగు రోజులు ముందు నడవలేని వికలాంగులు, 65 ఏళ్లు వయసు పైబడిన వృద్ధులకు ప్రభుత్వ చౌకధాన్యం డిపోలు నిర్వహిస్తున్న డీలర్లు ఇంటి దగ్గకు వెళ్లి బియ్యం పంపిణీ చేయలని ఆదేశించడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## గుత్తి పట్టణ అధ్యక్షుడిగా ఎంకే చౌదరి

**- మండల అధ్యక్షుడిగా బద్రివలి నియామకం**



**గుత్తి - సూర్య వాస్తవం, జూన్ 27:** గుత్తి గుంతకల్లు నియోజక వర్గం శాసన సభ్యుడు గుమ్మనూరు జయ రాం అధ్యక్షతన తెలుగుదేశం పార్టీ సంస్థాగత కమిటీలను సెలెక్ట్ చేయడం జరిగినది. ఈ సందర్భంగా గుత్తి పట్టణ అధ్యక్షుడిగా ఎంకే చౌదరి, మండల అధ్యక్షుడిగా ఎస్ బద్రివలి, గుత్తి పట్టణ ప్రధాన కార్యదర్శిగా ప్రసాద్, మండల కా ర్యదర్శిగా పల్లా సాంబ శివయ్యను నియమించినట్లు ప్రకటించారు. ఈ సందర్భంగామాట్లాడుతూ ఈ అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్, గుంతకల్ ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం, ఇంచార్జ్ గుమ్మనూరు ఈశ్వర్, అబ్జర్వర్స్‌కి కృతజ్ఞతలు తెలిపారు.

## రూ.3.03 కోట్లు విలువజేసే

# మొబైల్ ఫోన్లు బాధితులకు అందజేత

**- మొబైల్ ఫోన్లు 12,594 వీటన్నింటి విలువ సుమారు రూ .24.11 కోట్లు**

**- అనంతపురం పోలీస్ పరేడ్ మైదానంలో జిల్లా పోలీసుశాఖ రికవరీ మొబైల్ ఫోన్ల మేళా - సెల్ ఫోన్ల రికవరీలో జిల్లా ఎస్పీ మార్క్**

**- జిల్లా పోలీసు సేవలు పట్ల ప్రజల్లో సంతృప్తి - పోయిన ఫోన్లు తిరిగి చేతికి అందడంతో బాదితుల్లో వెల్లివిరిసిన ఆనందం**








**అనంతపురం క్రైం - సూర్య వాస్తవం, జూన్ 27:** జిల్లా ఎస్పీ జగదీష్ శుక్రవారం నాడు రూ.3.03 కోట్లు విలువ చేసే 1216 సెల్ ఫోన్లను బాధిత ప్రజలకు అందజేశారు.జిల్లాలో ప్రజల మొబైల్ ఫోన్లు చోరీకు గురై అవి ఇతర రాష్ట్రాలకు చేరినా రికవరీలో రాజీపడని జిల్లా పోలీసులు. ఇప్పటి వరకు రికవరీ చేసి అందజేసిన 12,594 ఫోన్లలో దేశవ్యాప్తంగా 20 రాష్ట్రాలలోని బాధితులకు ముట్టజెప్పిన ఫోన్లు 1179 మన రాష్ట్రంలోని అనంతపురం కాకుండా మిగితా 18 జిల్లాల బాధితులకు అందజేసినవి


2795 రికవరీ చేసి అందజేసిన మొబైల్ ఫోన్లు ధర రూ. 499 నుండి రూ 1.41,000 వరకు ఉన్నాయి. 26 వ తేదీన జిల్లా పోలీసుశాఖ చాట్ బాబ్ సేవలు ప్రారంభించి చోరీకి గురైనా లేదా మిస్సయిన మొబైల్ ఫోన్ జాడ కనుక్కొని రికవరీ చేసి ప్రజలకు అందజేయడం ప్రారంభించిన విషయం తెలిసిందే. సెల్‌ఫోన్ దుకాణం నిర్వాహకులైనా, వ్యక్తులైనా ఎవరైనా సరే అపరిచితులు అమ్మే ఫోన్లను కొనుగోలు చేయొద్దని ఎస్పీ సూచించారు.అమ్మేవారు పరిచయస్తులైనా సరే బిల్లులు, సంబంధిత మొబైల్ ఫోన్ వివరాలు కల్గిన బాక్సు ఉంటేనే కొనాలని తెలిపారు.ఆర్టీసీ బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు, తదితర ప్రదేశాలలో మోసపు మాటలతో నమ్మబలికే వారి పట్ల ఇబ్బంది పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఎస్పీ విజ్ఞప్తి చేశారు. అపరిచితులతో ఫోన్ కొనడం వల్ల

ఇటు సెల్ ఫోన్ పోగొట్టుకున్న బాధితుడు. అటు కొన్న వ్యక్తి కూడా నష్టపోతాడని గుర్తించి దూరంగా ఉండాలనీ మొబైల్ ఫోన్లు తస్కరించే వారిపై ప్రత్యేక నిఘా వేస్తిన జిల్లా పోలీస్. చాట్ బాట్ సేవల ద్వారా బాధితులకు న్యాయం చేస్తున్న అనంత పోలీసులు.ఫోన్ చోరీకి గురైనా మిస్ అయినా చాట్‌బాట్‌లో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సి.ఈ.ఐ.ఆర్ ద్వారా నమోదు చేసుకోవాలన్నారు. సి.ఈ.ఐ.ఆర్‌లో ఎలా నమోదు చేసుకోవచ్చో చాట్‌బాట్‌లో సూచనలు కూడా చేశాం. వెంటనే సిమ్, ఐఎంఈఐ నంబర్లను బ్లాక్ చేస్తారు. దీనివల్ల సదరు మొబైల్ నంబర్, మొబైల్ ఫోన్ లో ఉన్న విలువైన సమాచారం దుర్వినియోగం కాకుండా ఉండే వీలుంటుందనీ తెలియజేశారు. ప్రజలు పోగొట్టుకున్న సెల్ ఫోన్లు జవాబుదారీగా అందించేందుకు కృషి చేసిన జిల్లా పోలీస్ సైబర్ విభాగం సి.ఐ షేక్ జాకీర్, సిబ్బందిని జిల్లా ఎస్పీ అభినందించారు.

బిల్లులేకుండా సెల్‌ఫోన్ అమ్ముతా మంటు నమ్మబలికే వ్యక్తులు, సెల్ ఫోన్ దుకాణాలు, బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు తదితర ప్రాంతాలలో అనుమానాస్పదంగా సంచరించే వారిపై సమీపంలోని పోలీసు స్టేషన్‌కు లేదా డయల్ 100, 112 కు సమాచారం చేరవేయాలని విజ్ఞప్తి చేశారు. మీ సెల్‌ఫోన్ పోగొట్టుకున్నా లేదా చోరీకు గురైనా ఈకింద కనపరిచిన లింక్స్ ఓపెన్ చేసి సమాచారం పొందుపరచండనీ తెలిపారు.

## విద్యుత్ శాఖ లోపం వెలగని వీధి దీపం..!

**- కాలనీలో కమ్ముకున్న చీకట్లు - ఆరు దాటితే భయం.. భయం..**





**పత్తికొండ టౌన్ - సూర్య వాస్తవం, జూన్ 27:** పత్తికొండ పట్నం స్థానిక 19వ వార్డు కాలనీలో గత కొన్ని రోజులుగా వీధి దీపాలు వెలగడం లేదు. దాంతో సాయంత్రం పూట స్థానిక ప్రజలు బయటకు వెళ్లాలంటేనే భయపడే పరిస్థితి వచ్చింది. అసలే వాన కాలం కావడంతో సాయంత్రం వేళన పాములు, తేళ్లు లాంటి విష పురుగులు బయటికి వస్తున్నాయి. ఇళ్లల్లో చిన్న పిల్లలు ఉండడంతో రాత్రి సమయంలో వీధి దీపాలు కూడా వెలగకపోవడంతో ఇండ్ల నుండి బయటకు వెళ్లాలంటే స్థానికులు జంకుతున్నారు. పత్తికొండ ఏఈ ఉన్న వారు ఆశించిన స్థాయిలో పని చేయడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. కొత్తగా వీధి దీపాల ఏర్పాటు, నిర్వహణ కోసం లక్షల రూపాయాలు ఖర్చు చేస్తున్న వెలుగులు పంచక పోవడం తో రాత్రివేళ్లలో భయంతో వాహనదారులు రాకపోకలు సాగిస్తున్నారు. కొన్ని రోజులుగా సమస్య నెలకొన్నా అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా వీధి దీపాల నిర్వహణను మెరుగు పరచడానికి పత్తికొండ ఎమ్మెల్యే చొరవ తీసుకొని విద్యుత్ శాఖ అధికారులు తగినచర్యలు తీసుకోవాలనీ పత్తికొండ వాసులు కోరుతున్నారు.

## ఉరవకొండ ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య సిబ్బంది నిర్లక్ష్యం



**అనంతపురం - సూర్య వాస్తవం, జూన్ 27:** అనంతపురం జిల్లా ఉరవకొండ నియోజకవర్గం కేంద్రంలోని గవర్నమెంట్ హాస్పిటల్‌లో పేషంట్ల పట్ల డాక్టర్లు, నర్సులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, చాలా సీరియస్‌గా ఉన్న పేషెంట్లు కూడా డాక్టర్లు నర్సుల దగ్గరకు వచ్చి ఇంజక్షన్లు మందులు వేయించుకోవాలని లేదంటే మీ చావు మీరు చావండని హాస్పిటల్‌లో ఉన్న పేషెంట్లు వారి బంధువులు ఆవేదన చెందుతున్నారు. నడవలేని స్థితిలో ఉన్న పేషెంట్ ను కూడా మీరే ఎత్తుకొని నా దగ్గరకు రండి అని నర్సులు అంటున్నారని డాక్టర్ను సంప్రదిస్తే మీకు రోగం నయం కావాలంటే మీరే నర్సులు దగ్గరికి పోవాలని డాక్టర్ కూడా అవహేళనగా, చాలా నిర్లక్ష్యంగా, దౌర్జన్యంగా మాట్లాడుతున్నారని పేషెంట్లు వారి బంధువులు అంటున్నారు. అడ్మిట్‌లో ఉన్న పేషెంట్స్ దాదాపుగా 65 సంవత్సరాలు పైబడిన వారు వృద్ధులు పైన అడ్మిట్‌లో ఉంటే ఇంజక్షన్ వేయాలి. మేము పైకి రాము మీరే కిందికి రండి అని అక్కడ ఉన్న డాక్టర్స్, నర్సులు చెప్పారని, పేషెంట్స్ నడవలేని పరిస్థితిలో ఉన్నప్పటికీ ఆయాస పడుతూ కిందకు వచ్చి ఇంజక్షన్స్ వేపించుకున్న దృశ్యం. ఈ కార్యక్రమంలో ఆలిండియా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఐక్యవేదిక కార్యదర్శి జంగం కుమార్‌స్వామి, టిడిపి కార్యకర్త సాకే.సురేంద్ర, ఎమ్మార్పీఎస్ మండల కార్యదర్శి మీనుగా రామాంజనేయులు, ఎంవిఎంఎస్ మీనుగా ధనుంజయ, డాక్టర్‌తో మాట్లాడితే డాక్టర్ కూడా నిర్లక్ష్యంగా వ్యవహరించారని, ఈ సందర్భంగా వారు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ ఐక్యవేదిక కార్యదర్శి జంగం కుమార్ ఇంత నిర్లక్ష్యంగా పేషంట్లను పశువుల కన్నా, హీనంగా చూస్తున్నారని, ఆవేదన చెందారు. పేషంట్లపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నా ఉరవకొండ గవర్నమెంట్ హాస్పిటల్ డాక్టర్లు నర్సులపై కఠిన చర్యలు తీసుకోవాలని, లేదంటే గవర్నమెంట్ హాస్పిటల్ ముట్టడిస్తామని ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

## జనసేనకు బలమైన నేతగా ఎదుగుతున్న కత్రిమల సుబ్బు

**- పాత్రికేయ రంగం నుంచి ప్రజానేతగా మారుతున్న ప్రజాప్రియుడు**



**పామిడి - సూర్య వాస్తవం, జూన్ 27:** సుదీర్ఘకాలంగా పామిడి మండలంలో జర్నలిజం రంగంలో ప్రజల తరఫున గళమెత్తిన సీనియర్ పాత్రికేయుడు కత్రిమల సుబ్బు ఇప్పుడు జనసేన రాజకీయ వేదికపై కొత్త శక్తిగా అవతరించారు. జనసేనలోకి ప్రవేశించినప్పటి నుంచే పార్టీ విధానాలను నమ్మకంగా అనుసరిస్తూ, పార్టీ కార్యకలాపాలలో అహర్నిశలు శ్రమిస్తూ, ప్రజల్లో మక్కువ కలిగించేలా తన సేవలతో చురుగ్గా మారిపోయారు. ప్రస్తుతం జనసేన పార్టీ పామిడి మండల కన్వీనర్ పదవి కోసం జరిగే పోటీలో కత్రిమల సుబ్బు పేరు ప్రతిష్టాత్మకంగా చర్చకు వస్తోంది. పార్టీ వర్గాల సమాచారం ప్రకారం, సుబ్బుకు కార్యకర్తల నుండి, యువజన మద్దతు విశేషంగా పెరుగుతోంది. పామిడి ప్రాంతంలో జనసేనకు దీర్ఘకాలిక పునాదులు వేసేందుకు అవసరమైన నిబద్ధత, సామాజిక స్పృహ, ప్రజల్లో నమ్మకం ఇవన్నీ కత్రిమల సుబ్బు లో ఉన్నాయని జనసైనికుల అభిప్రాయం.సమీక్షిస్తే, గత కొన్ని నెలలుగా పామిడి మండలంలోని గ్రామాలన్నింటిలో పార్టీ గుర్తింపు పెంచేలా సుబ్బు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమాలు ప్రజల్లో చైతన్యాన్ని రేకెత్తించాయి. యువతను ప్రేరేపిస్తూ, మైనారిటీలను పార్టీ వైపు లాగుతూ, అన్ని వర్గాలతో మమేకమవుతూ పనిచేస్తున్నారు. కత్రిమల సుబ్బు పాత్రికేయుడిగా ప్రజల మనస్సుల్లో చోటు చేసుకున్నారు. ఇప్పుడు నాయకుడిగా ప్రజల ముందుండే సామర్థ్యం ఉన్నది. ఆయన నేతృత్వం సాధించినట్లయితే, పామిడిలో జనసేనకు కొత్త ఒరవడి మొదలవుతుంది" అని స్థానిక నాయకులు అంటున్నారు. పామిడి మండలంలో పార్టీకి బలం పెరగాలంటే, నిబద్ధత గల, ప్రజలకు చేరువైన, రాజకీయ అనుభవం కలిగిన నాయకుడు అవసరం. అలాంటి అన్ని అర్హతలు కత్రిమల సుబ్బు లో ఉన్నాయని కార్యకర్తల నమ్మకం. ఆయన కన్వీనర్ బాధ్యతలు చేపడితే, పార్టీలో స్పష్టమైన మార్పు వస్తుందని విశ్వాసం వ్యక్తమవుతోంది.

# నియంత పాలనలా చంద్రబాబు పాలన

- కూటమి ప్రభుత్వ మోసాలను ప్రజలకు తెలియజేయాలి
- ప్రభుత్వంలోని తప్పులను ప్రశ్నించిన వారిపై అక్రమ కేసులు పెడుతున్నారు
- వైఎస్ఆర్ సిపి రీజనల్ కో -ఆర్డినేటర్ పెద్దిరెడ్డి రామచంద్రా రెడ్డి



**రాయచోటి - సూర్యవాస్తవం, జూన్ 27 :** నియంత పాలనలా చంద్ర బాబు పాలన కొనసాగు తోందని వైఎస్ ఆర్ సీపీ రీజనల్ కో ఆర్డినేటర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. శుక్రవారం అన్నమయ్య జిల్లా కేంద్రమైన రాయచోటి పట్టణంలోని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన పెద్దిరెడ్డి రామ చంద్రారెడ్డి వేదికపై ఆయన మాట్లాడుతూ...జగన్ కంటే మెరుగ్గా పథకాలను అందిస్తామని నారా చంద్రబాబు నాయుడు ప్రజలను నమ్మించి మోసం చేశారన్నారు. ఎన్నికల హామీలను నెరవేర్చాలని చంద్ర బాబును ఎవరైనా అడిగితే మీ నాలుక మందం అయ్యిందని చంద్రబాబుఅంటారన్నారు.కరోనా సమ యంలో నూ అప్పటి ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి ఏ సంక్షేమ పథకాన్ని నిలుపుదల చేయకుండా ,వంద శాతం హామీలను నెరవేర్చారని ఆయన చెప్పారు. ప్రజలకు నేరుగా రూ.3 లక్షల కోట్ల నిధులను అందించిన ఘనత జగన్ కు దక్కుతుం దన్నారు. మాట తప్పడం చంద్రబాబు నైజం అన్నారు. 2014 సమ యంలోనూ జాబు రావాలంటే బాబు రావాలని ఉదరగొట్టారని, అధికారంలోకి వచ్చిన తరువాత లక్షలాది కాంట్రాక్ట్,ఔట్ సోర్సింగ్ ఉద్యోగాలను తొలగించారని ఆయన గుర్తు చేశారు. జిల్లా అధ్యక్షుడు ఆకేపాటి అమరనాథ అధ్య క్షతన జరిగిన సమావేశంలో పాల్గొన్న రాజ్యసభ సభ్యులు మేడా రఘునాద రెడ్డి, వైఎస్ఆర్ సిపి నియోజక వర్గ ఇంచార్జిలు చింతల రామచంద్రారెడ్డి (పీలేరు), ఎంఎల్ఏ పెద్దిరెడ్డి ద్వాం`కనాథ రెడ్డి (తంబళ్లపల్లె), నిస్సార్ అహమ్మద్ (మదనపల్లె), జెడ్ పి మాజీ చైర్మన్, ఇటీవల టి డి పి ని వీడి వైసిపిలో చేరిన సుగవాసి బాలసుబ్రమణ్యం తదితర నేతలు వేదికపై ప్రసం గించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఫయాచ్, భాష, వైస్ చైర్మన్, ఫయాజుర్ రహమాన్, జిల్లా మైనార్టీ నాయకుడు బేపారి మహమ్మద్, వైసీపీ సీనియర్ నాయకుడు జాకీర్, కౌన్సిలర్లు రౌనక్ హుస్సేన్, సుగవాసి శ్యామ్, ఇర్ఫాన్ రియాజ్ అహ్మద్,అయ్య వార్రెడ్డి, రియాజ్ లతో పాటు పలువురు వైసిపి కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రజల భాగస్వామ్యంతోనే

# మలేరియా జ్వరాల నియంత్రణ సాధ్యం

**మదనపల్లి -సూర్యవాస్తవం,జూన్27:**

ప్రజల భాగస్వామ్యం తోనే దోమ కాటు ద్వారా వ్యాప్తి చెందే వ్యాధులు మలేరియా, ఫైలెరియా, డెంగీ, చికెన్గుణ్య, మెదడు వాపు జ్వరాలను నియంత్రణ,వ్యాప్తిని అరికట్టవచ్చునని మలేరియా మాసోత్సవాల సందర్భంగా డిప్యూటీహెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ మహమ్మద్ రఫీ, సబ్ యూనిట్ అధికారి కళీలుళ్ళాఖాన్‌లు పేర్కొన్నారు. జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి ఆదేశాల మేరకు మదనపల్లి మండలం బొమ్మనచెరువు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో కోళ్ల బైలు సచివాలయం బాబు కాలనీలో ప్రజలకు, పాఠశాల విద్యార్థులకు, ఇందిరా నగర్‌లో అవగాహన సదస్సులు డాక్టర్ సల్మాన్ ఖాన్ ఆధ్వర్యం లో నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ మహమ్మద్ రఫీ మాట్లాడుచు ఐదు రకాల జ్వరాలు ప్రజారోగ్యానికి ప్రమాదమని, ఇటీవలే ప్రభుత్వం మలేరియా వ్యాధిని నోటిపైయబల్ డిసీస్‌గా గుర్తించిం దన్నారు. తీవ్ర జ్వరం, చలి, తలనొప్పి, నీరసం, వాంతులు, వికారం, కనుగుడ్లు పక్కకు తిప్పలేక పోవడం, శరీరంపై దద్దులు, రక్తకణాల సంఖ్య తగ్గి పోవడం, కీళ్లనొప్పులు వంటి లక్షణాలు ఈ జ్వరాలలో కనిపిస్తాయిని, వ్యాధి లక్షణాలు ను బట్టి రక్తపరీక్షలు చేయించుకుని,సకాలంలో చికిత్స పొందితే ప్రాణాపాయం ఉండదన్నారు. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం,చెత్త దిబ్బలు ఊరికి దూరంగా వేసుకోవాలని, పందులను గ్రామానికి 5కి.మీ దూరంగా ఉంచాలని, ప్రతి శుక్రవారం డ్రై డే పాటించాలని,నీటి నిల్వలుపై మూతలు ఉంచాలని,ధోమతెరలు వాడాలని, కిటికీలకు మెష్ కొట్టించాలని, ప్రతీ రోజు సాయంత్రం ఇంటిలో



పచ్చి వేపాకు పొగ వేసుకోవాలని ప్రతీ రోజు ఇంటిలో సాయంత్రం లైట్స్ వేసినప్పుడు తలుపులు, కిటికీలు మూసి వేయాలని 10.కాలువలలో చెత్తవీయరాదని సూచించారు. ఇవి పాటిస్తే దోమలు నియంత్రణ జరుగుతుందని తెలిపారు. గర్భవతులు, బాలింతలు, పది సంవత్సరాలు లోపు పిల్లలు, అరవై సంవత్సరాలు పైబడిన వారిలో వ్యాధి నిరోధక శక్తి తక్కువ కనుక జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. అనంతరం కరపత్రాలు పంపిణీ చేస్తు, నినాదాలతో ప్లేకార్డ్స్, బ్యానర్స్ ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దొంతి వీధి ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యులు డాక్టర్ సల్మాన్ ఖాన్, డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ మహమ్మద్ రఫీ, సబ్ యూనిట్ అధికారి కళీలుళ్ళాఖాన్, ఆరోగ్య పర్యవేక్షకులు మహి, సి హెచ్. ఓ అనూష, ఏ. ఎన్. ఎమ్ లు వీణ, లావణ్య, రాధా, హెల్త్ అసిస్టెంట్ గంగయ్య, ఆశా కార్యకర్తలు హెచ్. ఎమ్. విజయలక్ష్మి, ఉపాధ్యాయ బృందం, ప్రజలు, విద్యార్థులు పాల్గొన్నారు.

## హార్సిలీ హిల్స్‌లో కార్పొరేట్ సంస్థకు

# భూములు కేటాయిస్తే ప్రజా పోరాటం చేస్తాం

- ప్రభుత్వం పర్యాటక కేంద్రంగా మరింత అభివృద్ధి చేయాలి
- వ్యాపారవేత్తకు అధికారిక లాంఛనాలతో స్వాగతం పలకడంపై ఆక్షేపణ
- కాంగ్రెస్ పార్టీ నాయకులు రెడ్డి సాహెబ్, వామపక్ష ప్రజా సంఘాల అభ్యంతరం



**మదనపల్లి -సూర్యవాస్తవం, జూన్27:**


ఆంధ్ర ఊటీగా రాష్ట్రంలో గుర్తింపు పొందిన పర్యాటక కేంద్రం హార్సిలీ హిల్స్‌లో కార్పొరేట్ సంస్థకు భూములు అప్పగించడాన్ని మదనపల్లె నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎస్.రెడ్డి సాహెబ్, సిపిఐ, ఏఐటియుసి, అమాద్మీ, సిపిఎం, బాస్ సంస్థ నాయకులు వ్యతి రేకించారు. ప్రముఖ పర్యాటక కేంద్రం హార్సిలీ హిల్స్‌ను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మరింత చోరవ తీసుకొని అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో అ పార్టీ నాయకులు రెడ్డి సాహెబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశానికి సిపిఐ పార్టీ జిల్లా కార్యదర్శి పిఎల్ నరసింహులు, సీపీఐ పార్టీ నాయకులు కృష్ణప్ప, మురళి, ఏఐటియుసి నాయకులు సాంబ శివ, ఆమ్ ఆద్మీ పార్టీ నుంచి రహీం సయ్యద్, బాస్ సంస్థ అధ్యక్షులు పిటిఎం శివప్రసాద్, సిపిఎం పార్టీ నుండి ప్రభాకర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఈశ్వరమ్మ, మహమ్మద్ అలీ లు హాజరయ్యారు.

ఈ సందర్భంగా రెడ్డి సాహెబ్ మాట్లాడుతూ యోగా గురువు రాందేవ్ బాబాకు భూములు కట్టబెడితే వామపక్ష పార్టీలు ప్రజాసంఘాలతో కలసి పోరాటం చేస్తామని హెచ్చరించారు. వ్యాపార వేత్త రాందేవ్ బాబా మదనపల్లె చేరుకున్న సందర్భంలో సబ్ కలెక్టర్, డియస్పీ, నియోజకవర్గ అధికారులు స్వాగతం పలకడం పై ఆక్షేపించారు. హార్సిలీ హిల్స్‌లో వైసిపి ప్రభుత్వం యాత్ర సినిమా డైరెక్టర్ కు భూ కేటాయింపులు చేస్తే వ్యతిరేకించిన అనాటి కూటమి నాయకులు నేడు పతాంజలి కార్పొరేట్ సంస్థకు అప్పగించడాన్ని ఎలా సమర్ధిస్తారని ప్రశ్నించారు.

కార్పొరేట్ సంస్థ కోసం భూ కేటాయింపు చేస్తే సమర్థించబోమని ప్రజా ఉద్యమం చేపడుతామని హెచ్చరించారు. సీపీఐ నాయకులు పియల్ నరసింహులు, కృష్ణప్ప, మురళి, సాంబ శివలు మాట్లాడుతూ టూరిజం ప్రాజెక్టు కింద హార్సిలీ హిల్స్‌ను మరింతగా అభివృద్ధి చేయాల్సిన ప్రభుత్వం ఒక మతానికి సంబందించిన పతాంజలి కార్పొరేట్ సంస్థ కు భూములు అప్పగిస్తే అది ప్రజలకు తీవ్రమైన నష్టమని అభ్యంతరం తెలిపారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు హార్స్ లీ హిల్స్ లో ఆయుర్వేద యూనివర్సిటీని అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు. యోగా కంటే ప్రజలకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు ఎంతో ముఖ్యమని గుర్తు చేశారు. పేద ప్రజలు ఆహ్లాదకరంగా హార్సిలీ హిల్స్ ను సందర్శించే అవకాశం లేకుండా దూరం చేయడమే కార్పొరేట్ సంస్థలకు అప్పగించడమని విమర్శించారు. బాస్ అధ్యక్షులు పిటిఎం శివప్రసాద్ మాట్లాడుతూ యోగ అంతర్జాతీయ వెల్ నెస్ సెంటర్ ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం భూములు అప్పగించే బదులు పాఠశాలల్లో కళాశాలలో యోగా తరగతులు నిర్వహిస్తే మరింత అవగాహన పెరుగుతుందని గుర్తు చేశారు. పతాంజలి సంస్థను తమిళనాడు ప్రభుత్వం బ్యాన్ చేసిన విషయాన్ని గుర్తు చేశారు. పేదలకు రెండు సెంట్లు భూమి ఇవ్వడాన్ని పాలక వ్యతిరేకించే ప్రభుత్వాలు కార్పొరేట్లకు ప్రభుత్వ భూములు ధరాధత్తం చేయడం తగదన్నారు.


# హిందూ సోదరుడిని ఆదుకున్న ముస్లిం సోదరులు

- హిందూ ముస్లిం భాయ్ భాయ్ అనడమే కాదు.. చేతల్లో చూపించారు..!
- ఇది కద అసలైన లౌకికవాదం... పరమత గౌరవం...!



**శ్రీ సత్య సాయి జిల్లా - సూర్య వాస్తవం, జూన్ 27:** హిందూ ముస్లిం భాయ్ భాయ్ అని మాటలు చెప్పడం కాదు.. దాన్ని చేతల్లో చూపించడమే ఈ సమాజానికి కావాలి. అసలైన లౌకికవాదం ....పరమత గౌరవం అంటే ఏమిటో చూపించారు శ్రీ సత్యసాయి జిల్లా లోని ముస్లింలు. అసలు వివరాల్లోకి వెళితే..... శ్రీ సత్యసాయి జిల్లా నల్లమాడ రామస్వామి గుడిలో గత పది సంవత్సరాలుగా పనిచేస్తున్న పూజారి బాలాజీ రవికుమార్ ద్విచక్ర వాహనంలో వెళ్తుండగా ప్రమాదవశాత్తు పుట్టపర్తి దగ్గర యాక్సిడెంట్ జరిగింది. బాలాజీ రవికుమార్ అనంతపురం సన్ రే ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలుసుకున్న మారాలా మదరస ముఫతిసాబ్ అబ్దుల్ సలాం, నల్లమాడ మక్కా మసీద్ ముత్తవల్లి అబ్దుల్ హమీద్ ఖాన్, టిడిపి నాయకులు సలాం ఖాన్, బాబావలి ఖాన్ వెంటనే స్పందించి డబ్బు సాయం అనంతపూర్ సన్ రే హాస్పిటల్ కు వెళ్ళి బాలాజీ రవికుమార్ కుమారుడు రాహుల్‌కి అందజేశారు. ఈ విషయమై నల్లమాడ టిడిపి నాయకులు బాబావలి ఖాన్ సలాం ఖాన్ రాహుల్ తో ఫోన్లో మాట్లాడి పుట్టపర్తి ఎమ్మెల్యే సింధూర రెడ్డి కి విషయం తెలియజేసి ప్రభుత్వం నుండి సహాయం అందేలా చేస్తామని ధైర్యాన్ని చెప్పారు. ఈ కార్యక్రమంలో అనంతపురంకి చెందిన అబ్దుల్ రెహ్మాన్ పాల్గొన్నారు.

# గుత్తి పట్టణ అధ్యక్షుడిగా ఎంకే చౌదరి, మండల అధ్యక్షుడిగా బద్రివలి నియామకం



**గుత్తి-సూర్య వాస్తవం,జూన్ 27:** గుత్తి గుంతకల్లు నియోజక వర్గం శాసనసభ్యుడు గుమ్మనూరు జయరాం అధ్యక్షతన తెలుగుదేశం పార్టీ సంస్థాగత కమిటీలను సెలెక్ట్ చేయడం జరిగినది.ఈ సందర్భంగా గుత్తి పట్టణ అధ్యక్షుడిగా ఎం కే చౌదరి,మండల అధ్యక్షుడిగా ఎ స్ బద్రివలి, గుత్తి పట్టణ ప్రధాన కార్యదర్శిగా ప్రసాద్,మండల కార్యదర్శిగా పల్లా సాంబశివయ్యను నియమించినట్లు ప్రకటించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.... ఈ అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు,మంత్రి నారా లోకేష్,గుం తకల్ ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం,ఇంచార్జ్ గుమ్మనూరు ఈ శ్వర్‌కి అభ్యర్థులు కృతజ్ఞతలు తె లిపారు.

## రోడ్డు ప్రమాదంలో

# ఇద్దరికి తీవ్ర గాయాలు



**మదనపల్లి -సూర్య వాస్తవం, జూన్ 27:** రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు తీవ్రంగా గాయపడే సంఘటన శుక్రవారం సాయంత్రం పెద్ద తిప్ప సముద్రం మండలంలోజరిగింది. పోలీసుల కథనం మేరకు.. మం డలంలోని తుమ్మర కుంటకు చెందిన నాగార్జున 30, నవీన్ 32, బైకుపై పీటీఎం కి వెళుతుండగా, మార్గమధ్యంలోని బోర్లపల్లి వద్ద మరో ద్విచక్ర వాహనం బైకును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ ఇద్దరిని స్థానికులు వెంటనే మదనపల్లి ప్రభుత్వాసుపత్రికి తరలించారు.ఆస్పత్రి అత్యవసర విభాగం డాక్టర్లు పరీక్షించి మెరుగైన వైద్యం అందించారు. నాగార్జునకు మెరుగైన వైద్యం అవసరం ఉందని చెప్పడంతో కుటుంబీకులు బాధితున్ని బెంగళూరుకు తరలించారు. కేసు దర్యాప్తులో ఉందని పిటిఎం పోలీసులు తెలిపారు.

## సైబర్ నేరాలపై విద్యార్థుల్లో

# చైతన్యం తీసుకురండి : డిఎస్పీ

**మదనపల్లి - సూర్య వాస్తవం, జూన్ 27:** సైబర్ నేరగాళ్లతో విద్యార్థులు మోస పోకుండా చూడాలని మదనపల్లె డిఎస్పీ మహేంద్ర తెలిపారు. ప్రయివేట్ కళాశాలల యాజ మాన్యంతో శుక్రవారం సాయంత్రం డిఎస్పీ ఆఫీసులో ప్రత్యేక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా డిఎస్పీ మాట్లాడుతూ.. విద్యార్థులు సైబర్ నేరగాళ్ల బారిన పడి మోసపోకుండా చైతన్య పరచాలని యాజమాన్యానికి సూచించారు. అలాగే ప్రతి కళాశాలలోనూ సీసీ కెమెరాలు అమర్చాలని చెప్పారు. డ్రగ్స్, యూవ్ టీజింగ్ వంటివి జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. విద్యార్థినిలు శక్తి యాప్ ఫోన్లో ఇన్స్టాల్ చేసుకుని ఆపద సమయంలో వినియోగించుకునేలా అవగాహన కల్పించాలని చెప్పారు. ఈ సమావేశంలో సీఐలో ఎరిసావల్లి, రామచంద్ర, సత్యనారాయణ, కళా వెంకట రమణలు పాల్గొన్నారు.



# పూర్వ విద్యార్థుల ఉదారత...

## బాలికల కోసం డైనింగ్ హాల్ ఏర్పాటు



**పత్తికొండ టౌన్ – సూర్య వాస్తవం, జూన్ 27:** పత్తికొండ ప్రభుత్వ జూనియర్ కళాశాల ఇంటర్మీడియట్ పూర్వ విద్యార్థులు (1974–76) కళాశాల అభివృద్ధికి సహాయం చేయడానికి నడుం బిగించారు. తమ వంతు కర్తవ్యంగా బాలికలకు డైనింగ్ హాల్ ఏర్పాటు చేశారు. శనివారం నాడు కళాశాల ప్రిన్సిపల్, అధ్యాపకులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...ఈ కళాశాలలో చదివి ఉన్నతులైనందుకు తమకు రుణం తీర్చుకునే అవకాశం వచ్చిందని ఈ కళాశాల అభివృద్ధికి సహాయ సహకారాలు అందిస్తామని పూర్వ విద్యార్థులు తెలియజేశారు.

# కొత్త అధ్యక్షులకు శుభాకాంక్షలు తెలిపిన టిడిపి నాయకులు



**గుత్తి–సూర్య వాస్తవం,జూన్ 27:** గుత్తి గుంతకల్ నియోజకవర్గం మ్మెల్యే గుమ్మనూరు జయరాం నాయకత్వాన గుత్తి పామిడి ఇంచార్జ్ గుమ్మనూరు ఈశ్వర్ సూచనలతో గుత్తి పట్టణం అధ్యక్షునిగా ఎం కే చౌదరి,గుత్తి మండలక న్వీనర్ బద్రివలిని నియమించి నందుకుగాను శుభాకాంక్షలు తెలియజ ేస్తున్నాము. ఇలాంటి ఎన్నో ఉన్నత పదవులు అధిరోహిస్తారని మనస్ఫూర్తిగా కోరుకు ంటున్నా ము.ఈ కార్య క్రమంలో 17వ వా ర్డు ఇంచార్జ మైనార్టీ సీనియర్ నా యకులు ఎస్ ఎం భాష,ఆస్పత్రి కమిటీ మెంబర్ చికెన్ శీన, బూత్ కన్వీనర్ రసూల్ ,17వ వార్డు అధ్యక్షుడు వడ్డే వెంకటేష్ ,బూత్ కన్వీనర్ అశోక్, బూతు కన్వీనర్ రంగస్వామి,లక్ష్మణ్ చౌదరి, రియా జ్,క్లస్టర్ ఇంచార్జ్ రసూల్,దౌలత దితరులు పాల్గొన్నారు.

# కుప్పం ద్రవిడ వర్సిటీకి ఇంజనీరింగ్ కోర్సులు మంజూరు

### - ప్రజల తరపున సిఎంకు కృతజ్ఞతలు తెలిపిన ఎమ్మెల్సీ కంచర్ల ఏపిఎస్ ఆర్టీసీ ఉపాధ్యక్షులు పి ఎస్ మునిరత్నం.

**కుప్పం –సూర్య వాస్తవం, జూన్ 27:**కుప్పం ద్రవిడ విశ్వవిద్యాలయానికి ఇంజనీరింగ్ కోర్సులు మంజూరు చేయడం పట్ల కుప్పం ప్రజలు తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు. విద్యార్థులు ఎన్నాళ్లుగానో ఎదురుచూస్తున్న ఈ కోర్సులు మంజూరవడం పట్ల కుప్పం విద్యాభివృద్ధికి మరో కీలక ముందడుగుగా పడింది.ఈ సందర్భంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు, విద్యాశాఖ మంత్రి శ్రీ నారా లోకేష్ కుకుప్పం ప్రజల తరఫున ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్,ఏపిఎస్ ఆర్టీసీ ఉపాధ్యక్షులు పి ఎస్ మునిరత్నం, ద్రావిడ విశ్వవిద్యాలయ అధికారులు, ఉద్యోగులు విద్యార్థులు కృతజ్ఞతలు తెలియజేశారు.

# గంజాయి స్మగ్లర్లు ఐదుగురు అరెస్ట్

### - రూ.3 లక్షల 50వేలు విలువ గల 20 కిలోల గంజాయి పట్టివేత - 3 సెల్ ఫోన్లు స్వాధీనం

### - విలేకరుల సమావేశంలో నాయుడుపేట డీఎస్పీ చెంచు బాబు




**నాయుడుపేట–సూర్య వాస్తవం, జూన్ 27:** తిరుపతి జిల్లా సూళ్లూరుపేట పట్టణంలోని నేషనల్ హైవే మన్నారు పోల్లూరు భారత్ పెట్రోల్ బంకు వద్ద ఐదు మంది గుర్తుతెలియని వ్యక్తులు అక్రమంగా గంజాయిని తరలిస్తుండటంతో వారిని సూళ్లూరుపేట పోలీసులు అదుపులోకి తీసుకున్నారు,అనంతరం సూళ్లూరుపేట పోలీస్ స్టేషన్‌లో సిఐ కార్యాలయంలో విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా నాయుడుపేట డిఎస్పి చెంచు బాబు పాల్గొని మీడియాకు వివరాలు తెలియచేశారు.

తిరుపతి జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు నాయుడుపేట డిఎస్పి చెంచుబాబు పర్యవేక్షణలో గంజాయి అక్రమ రవాణాపై నిగా పెట్టడంతో శుక్రవారం తిరుపతి జిల్లా సత్యవేడు ప్రాంతానికి చెందిన తొంద మునిశేఖర్ ,చోడవరం జ్యోతిష కుమార్, సూళ్లూరుపేట ప్రాంతానికి చెందిన ఎలింబేటిసునీల్, పాల వినయ్, తడ ప్రాంతానికి చెందిన ముద్దు రాజేష్ అనే, 5మంది వ్యక్తులు కలిసి ఒరిస్సా నుండి గంజాయిని తీసుకుని వచ్చి సూళ్లూరుపేట, తడ,శ్రీ సిటీ ప్రాంతాలలో విక్రయించడమే కాకుండా ఇతర రాష్ట్రాలకు తరలిస్తున్నట్లు తెలిపారు. సూళ్లూరుపేట లోని మన్నారు పోల్లూరు భారత పెట్రోల్ బంకు వద్ద కాలి స్థలంలో 5మంది వ్యక్తులు గంజాయిని తరలిస్తుండగా వారిని అదుపులోకి తీసుకొని అరెస్టు చేసి వారి వద్ద నుండి సుమారు 3లక్షల 50వేలు విలువ చేసే 20 కిలోల గంజాయి తో పాటు మూడు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకొని వారిపై కేసు నమోదు చేసినట్లు ఈ సందర్భంగా డిఎస్పి చెంచు బాబు తెలిపారు.ఈ సమావేశంలో సిఐ మురళీకృష్ణ పోలీసు సిబ్బంది తదితరులు ఉన్నారు.

# కట్టమీద పేదల గుడిసెలు...కట్ట కింద లేఔట్లు

- కట్ట వేసింది ముంపు నీరు బయటకు రాకుండా కానీ రియల్టర్లు మాత్రం చెరువునాక్రమించి లేఅవుట్లు వేస్తున్న వైనం
- విచిత్రం ఏమిటంటే ఈ లేఔట్లకు అటు మున్సిపల్ శాఖ అధికారులు, రెవెన్యూ శాఖ అధికారులు అనుమతులు మంజూరు చేయడం
- ఇప్పుడు ఆ భూములకు సంబంధించిన పంపకాలలో కుటుంబ సభ్యులకు తగాదాలు కారణంగా గూడూరు కోర్టులో కేసు ...
- వీఆర్ఓ ఇందులో ప్రధాన పాత్ర



**నాయుడుపేట– సూర్య వాస్తవం, జూన్ 27:** అగ్గిపుల్ల, ఆడపిల్ల, సబ్బుబిళ్ళ, కుక్కపిల్ల.. కాదేది కవితకు అనర్హం అన్నాడు ఓ మహాకవి..అసైన్మెంట్,డీ కే టి, చెరువు పోరంబోకు, మేత పోరంబోకు, గుంటపోరంబోకు కాదేది అవినీతికి అనర్హం అంటున్నారు. నాయుడుపేటలో ఆ రెండు శాఖల అధికారులు.. రోజురోజుకీ నాయుడుపేట పెరిగి పోతుంది అటు విస్తీర్ణం కావచ్చు ఇటు జనాభా కావచ్చు. దీన్ని దృష్టిలో ఉంచుకొని రియల్టర్లు రెచ్చిపోతున్నారు నాయుడుపేటలో.. లోతట్టు ప్రాంతాలను, ముంపు ప్రాంతాలను, బఫర్ జోన్లను సైతం ఇళ్ల స్థలాలుగా మార్చి అమ్మకాలు సాగిస్తున్నారు.కోర్టులో వివాదాస్పదంగా ఉన్న భూములను సైతం లేఅట్లుగా మార్చి కొనుగోలుదారులను ఏమార్చుతున్నారు ఇందుకు మేముకూడా ఏమాత్రం తక్కువ తినలేదు అంటూ మున్సిపల్ శాఖ అధికారులుమరియు రెవిన్యూ శాఖ అధికారులు సైతం అనుమతులు మంజూరు చేయడం పై ఒకేద ఆశ్చర్యాన్ని వ్యక్తం చేస్తున్నారు ప్రజలు..ఇక నాయుడుపేటలో సప్తగిరి రైస్ మిల్లు వెనకన ఎల్ ఏ సాగరానికి సంబంధించిగతంలో ఒక చెరువు ఉండేది అక్కడ.. అటు జువ్వలపాలెం ఇటు ఎల్ ఏ సాగరానికి. ఇరువైపులా ఉండేది ఆ చెరువు.. చెరువు కట్టమీద కొంతమంది పేదవారు ఇప్పటికీ గృహాలను ఏర్పాటు చేసుకుని జీవిస్తున్నారు.. కాలక్రమేన చెరువు కాస్త అక్రమ ఇలకు గురై రూపురేఖలు లేకుండా పోయింది. ఆరు లైన్ల జాతీయ రహదారి పడడంతో పైగా ఇప్పుడు ఆ ప్రాంతాన్ని ఆనుకుని నాయుడుపేట–పూతలపట్టుఆరు లైన్ల జాతీయ రహదారి ఏర్పడడంతో దానికి ఇరువైపులా ఉన్న భూములకు అమాంతం రెక్కలు వచ్చాయి. దీనిని ఆసరాగా చేసుకుని కొంతమంది రియల్టర్లు అనుమతులు లేకుండా లేఅవుట్లను ఏర్పాటు చేసి కొనుగోలుదారుల జేబులకు కన్నం వేస్తున్నారు.

**కోర్టులో ఉన్న వివాదాస్పద భూములకు అనుమతులు :**ఎల్ ఏ సాగరం పరిధిలో ఉన్న సప్తగిరి రైస్ మిల్ వెనుక.. సర్వే నంబర్లు 110/7, 110/8, 110/9,లో ఉన్న 85 సెంట్లు భూమికి సంబంధించి కుటుంబ తగాదాలతో కోర్టును ఆశ్రయించారు.. సదరు కుటుంబ సభ్యులు..కోర్టు తదుపరి ఉత్తర్వుల మేరకు ఈ సర్వే నంబర్లకు సంబంధించిన భూములలో ఎలాంటి.. రిజిస్ట్రేషన్లు గాని, లేఔట్లకుగాని,మరి ఏ ఇతర లావాదేవీలకు కూడా జరప కూడదని. ఏడవ అడిషనల్ కోర్టు జడ్జి గూడూరు వారు.. తిరుపతి జిల్లా రిజిస్ట్రేషన్ వారిని అలాగే నాయుడుపేట సబ్ రిజిస్టర్ కార్యాలన్నీ, నాయుడుపేట రెవెన్యూ శాఖని,మున్సిపల్ శాఖలను అటాచ్ చేస్తూ ఆదేశాలను జారీ చేసింది కానీ ఇవేవీ పట్టించుకోని మున్సిపల్ అధికారులు రెవెన్యూ అధికారులు జలవనుల శాఖ అధికారులు లేఔట్లకు అనుమతులు ఇవ్వడమే కాకుండా ఆవైపు కన్నీటి చూసిన పాపాన పోలేదు అంటున్నారు.. ప్రజలు..

**నిలువెత్తుదనం వీ ఆర్ ఓ పాత్ర:**నా నిలువెత్తుదనం పోసిన తప్పు చేయను అంటూ పైకి ప్రగల్బాలు పలుకుతూ క్రింద,.. కింద..లక్షలు దోచేస్తున్న ఎల్ ఏ సాగరం విఆర్ఓ అవినీతి పరాకాష్టకు నిలువెత్తు నిదర్శనం ఇది.. కోర్టులో వివాదాస్పదంగా నడుస్తున్న భూములకు ఎలాంటి విచారణ జరుపకుండా లేఔట్లకు అనుమతులు మంజూరు చేయడంలో ఆయన ప్రధాన పాత్ర పోషించినట్లు తెలుస్తోంది.. అంతకకుండా అర్ధరాత్రుల్లో ప్రభుత్వ భూముల్లో అక్రమంగా మట్టిని తరలిస్తున్న.. ట్రాక్టర్ల యజమానులు దగ్గర దొరికినంత పిండుకొని.. వాహనాలను వదిలేసిన ఘనత ఆయనది.. నాయుడుపేటలో.. పౌర సరఫరాల గోదాంకు ఇన్చార్జిగా ఉన్న సమయంలో.. బియ్యం,పప్పులను. సరిహద్దులు దాటించిన ఘనత కూడా అయనదే..ఇటీవల నాయుడుపేట కు చెందిన ఒక ప్రముఖ కళ్యాణమండప.. యజమానుల వద్ద నుండి భూములకు సంబంధించి రెండు లక్షల రూపాయలను డిమాండ్ చేసినట్లు కూడా వినికిడి. ఇకనైనా జిల్లా ఉన్నతాధికారులు కలుగజేసుకొని ముంపు ప్రాంతంలో అలాగే బఫర్ జోన్లలో వెలసి ఉన్న లేఔట్లకు అనుమతులు రద్దు చేయాలని, డబ్బు కోసం ఎంతటి నేరానికైనా తెగిస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని నాయుడుపేట పట్టణ ప్రజలు కోరుకుంటున్నారు.




# జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలి

### - ఏపీడబ్ల్యూజేఎఫ్



**ఆదోని – సూర్య వాస్తవం, జూన్ 27:** జర్నలిస్టులకు ఇళ్లస్థలాల కేటాయించాలని ఎపిడబ్ల్యూజేఎఫ్ ఆధ్వర్యంలో ఎమెల్యే పార్థసారధి కి వినతి పత్రం అందజేశారు. శుక్రవారం ఎమెల్యే క్యాంప్ కార్యాలయంలో గౌరవ అధ్యక్షులు నాగరాజు,అధ్యక్షులు బసవరాజు,ప్రధాన కార్యదర్శి చంద్రమోహన్, ఉపాధ్యక్షులు ఉరుకుందప్ప, విజయ్‌లు మాట్లాడుతూ జర్నలిస్టులకు ఇంటి స్థలాల సమస్య చాలాయేళుగా అపరిష్కృతంగా ఉందని, ఎన్నికల సమయంలోనే జర్నలిస్టులకు ఇంటి స్థలం కేటాయిస్తామని ప్రణాళికలో ప్రకటించడంతో అందరూఎంతో ఆశగా ఎదురుచూస్తున్నారు. వారికి స్థలాల కేటాయింపు చేయడంతో పాటు అర్హులైన జర్నలిస్టులందరికీ ఇళ్లస్థలాలు కేటాయించేందుకు వీలుగా ప్రభుత్వం తగిన ఉత్తర్వులు జారీ చేయాలని తెలిపారు. ఇళ్లు కట్టుకు నేందుకు తగిన ఆర్థిక సహాయం అందించాలని కోరారు. గతంలో ఇళ్ల స్థలాల పట్టాలు ఇచ్చి స్థలాలు చూపలేదని, ఇప్పటికైనా అర్హులైన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని అన్నారు.అదేవిధంగా జర్నలిస్టులకు కలెక్టర్ గుర్తించిన అక్రిడేషన్ కార్డు దార్లకు గత ప్రభుత్వంలో రైల్వే పాసు ఇవ్వకుండా కాలయాపనం చేశారని, కూటమి ప్రభుత్వంలోనైనా రైల్వే పాసును ఏర్పాటు చేసేలా రైల్వే ఉన్నత అధికారుల దృష్టికి తీసుకెళ్లి చర్యలు తీసుకోవాలని కోరారు.. ఎమెల్యే పార్థసారథి సానుకూలంగా స్పందించి జర్నలిస్టుల సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తున్నారు.ఈ కార్యక్రమంలో ఎ పిడబ్ల్యూ జేఫ్‌నాయకులు మల్లికార్జున, యువరాజ్, మురళీకృష్ణ, ఖాన్, భీమా, రఘునాథ్ రెడ్డి, సుంకన్న, వీరేష్, చంద్రయ్య, నరసింహులు, తదితరులు పాల్గొన్నారు.

# మెరుగైన ఫలితాలు సాధించాల్సిందే..

### - ఐసీడీఎస్ పీడీ నాగమణి

### - ఎఫ్.ఆర్.ఎస్ లో వెనుకబడితే చర్యలు తప్పవని హెచ్చరిక

### - లక్ష్య సాధనలో వెనుకబడితే కలెక్టర్, డైరెక్టర్‌కు నివేదిక పంపుతామని స్పష్టీకరణ

**అనంతపురం క్రైం – సూర్య వాస్తవం, జూన్ 27:**

అంగన్వాడీ లబ్ధిదారులకు మెరుగైన సేవలందించే విషయంలో అలసత్వం, నిర్లక్ష్యం పనికి రాదు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సదుద్దేశంతో ప్రవేశ పెట్టి అమలు చేసే పథకం విజయవంతం కావాలంటే ఎవరి స్థాయిలో వారు అంకితభావంతో పని చేయాల్సిందే. లేదు.. మేమింతే అంటూ గిరి గీసుకు కూర్చుంటే పురోగతిలో వెనుకబడి పోతాం. దాని ప్రభావం ఒక్క ప్రాజెక్ట్ పైనే కాదు..మొత్తం జిల్లాపై పడుతుంది. దీన్ని సహించేది లేదు. ఇప్పటికైనా మారండి. కేటాయించిన పనిపై శ్రద్ధ పెట్టండి. లక్ష్య సాధనలో ముందు వరుసలో ఉండాలని ఐసీడీఎస్ పీడీ నాగమణి స్పష్టం చేశారు. అంగన్వాడీల్లో ముఖ హాజరు(ఎఫ్.ఆర్.ఎస్)లో జిల్లా వెనుకబడి ఉండడంపై పీడీ అసహనం వ్యక్తం చేసారు. ఇదే అంశంపై అనంతపురంలోని ఐసీడీఎస్ అర్బన్ ప్రాజెక్ట్ కార్యాలయంలో శుక్రవారం సమీక్ష నిర్వహించారు. జిల్లాలోని ఐసీడీఎస్ సూపర్ వైజర్లు హాజరయ్యారు. నోడల్ ఆఫీసర్ వనజాక్షి, ఎక్స్ టెన్షన్ ఆఫీసర్(ఈఓ) ఖాజీ రఫీమున్నీసా పాల్గొన్నారు. ఎఫ్.ఆర్.ఎస నమోదులో జిల్లా వెనుకబడి ఉండడానికి గల కారణాలు ప్రాజెక్టుల వారీగా పీడీ నాగమణి ఆరా తీశారు. ప్రాజెక్ట్ స్థాయిలో బ్లాక్ కో ఆర్డినేటర్ల, జిల్లా స్థాయిలో పోషన్ అభియాన్ ఉద్యోగులు తమకు ఏమాత్రం సహకరించడం లేదని సూపర్ వైజర్లు మూకుమ్మడిగా ఆరోపించారు. ప్రభుత్వం ఇచ్చిన మొబైళ్లు మొరాయించినా.. యాప్‌లు పని చేయకపోయినా.. పట్టించుకోవడం లేదన్నారు. ఈ అంశంపై పీడీ నాగమణి సీరియస్ అయ్యారు. పరస్పర సహకారం, సమన్వయంతో పని చేసి ఎఫ్.ఆర్.ఎస నమోదు ప్రక్రియలో జిల్లా మొదటి స్థానంలో వచ్చేలా ప్రతి ఒక్కరూ తమ పరిధిలో పని చేయాల్సిందేనని స్పష్టం చేసారు. లేదంటే కలెక్టర్, డైరెక్టర్ కు నివేదిక పంపి చర్యలకు సిఫార్సు చేస్తానని పీడీ స్పష్టం చేశారు. కలెక్టర్ వినోద్ కుమార్ అంకాంక్షలకు అనుగుణంగా ప్రతి ఉద్యోగి కష్టపడి పని చేసి, జిల్లాను పురోగతిలో ముందు వరుసలో ఉండేలా చొరవ చూపాలని సూచించారు.

